ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

5



శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
శుక్రవారం 30 ఆగస్టు 2024

ఎప్పుడెప్పుడా అని మత్స్యకారులు ఎదురుచూస్తున్న రోజు రానేవచ్చింది. బోగోలు మండలం జువ్వలదిన్నె వద్ద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్మించిన ఫిషింగ్ హార్బర్‌ను న్యూఢిల్లీ నుంచి ప్రధానమంత్రి నరేంద్రమోదీ వర్చువల్‌గా శుక్రవారం ప్రారంభించనున్నారు. నగరంలోని కలెక్టరేట్‌లో ఉన్న తిక్కన ప్రాంగణంలో మధ్యాహ్నం ఒంటిగంటకు జరిగే ఈ కార్యక్రమంలో వర్చువల్ విధానంలో ప్రధాని మోదీ శిలాఫలకాన్ని ఆవిష్కరించనున్నారు. ఈ మేరకు అధికార యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. కాగా, 2014-19లో అప్పటి కూటమి ప్రభుత్వంలోనే పురుడు పోసుకున్న ఈ హార్బర్ నిర్మాణానికి కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు సమానంగా ఖర్చు భరించేలా రూ.288 కోట్ల అంచనాతో రూపొందించారు. టీడీపీ హయాంలో స్థలసేకరణ పూర్తిచేసి అప్పగించారు. అప్పట్లో దీని నిర్మాణానికి అప్పటి సీఎం నారా చంద్రబాబు శంకుస్థాపన కూడా చేశారు. ఆ తర్వాత 2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో చేపట్టిన పనుల్లో మందగమనం కనిపించింది. చేసిన పనులకు బిల్లులు రాకపోవటంతో కాంట్రాక్టర్ మధ్యలోనే పనులు ఆపేశారు.

● ఎన్నికల ముందు వైసీపీ హడావుడి

పనులు పూర్తి కాకుండానే ఎన్నికల నోటిఫికేషన్‌కు రెండు రోజులు ముందు అప్పటి సీఎం జగన్మోహన్‌రెడ్డి వర్చువల్‌గా హార్బర్ ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేశారు. నిర్మాణం 70 శాతం మాత్రమే పూర్తి కావటంతో అక్కడ ప్రారంభోత్సవం చేస్తే ప్రజలకు వాస్తవాలు తెలుస్తాయని, బోగోలు ఎంపీడీవో కార్యాలయం వద్ద సీఎం వర్చువల్ ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేశారు. అయితే, కేంద్రం అనుమతి లేకుండానే ప్రారంభోత్సవ ఏర్పాట్లు చేయడంపై కేంద్రం ప్రభుత్వం అభ్యంతరం తెలపడంతో వాయిదా పడినట్లు సమాచారం.



● కలెక్టరేట్‌లో ఏర్పాట్లు

ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చాక. కొత్త కాంట్రాక్టర్‌తో పనులు పూర్తిచేయించారు. అప్పట్లో ఆగిన చేపలు ఆరబెట్టుకునేందుకు ఫ్లాట్‌ఫామ్‌లు, చేపలు నిల్వకు గోదాము నిర్మాణం పూర్తి చేశారు. అలాగే, మంచినీరు, విద్యుత్ వంటి సౌకర్యాలనూ సమకూర్చారు. ఇలా అన్ని పనులు అయ్యాక శుక్రవారం ఫిషింగ్‌హార్బర్ ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. కలెక్టరేట్‌లో జరిగే ప్రారంభోత్సవ కార్యక్రమంలో జిల్లాలోని ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొననున్నారు.

- నెల్లూరు (ఆంధ్రజ్యోతి)/కావలి



బోగోలు మండలం జువ్వలదిన్నె వద్ద ఫిషింగ్ హార్బర్ (ఫైల్)



మత్స్యకారులకు
మంచి రోజులు!

● నేడు ఫిషింగ్ హార్బర్ ప్రారంభం ● వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధాని మోదీ

వైసీపీకి బీఎమ్మార్ బైబై!

పూలమ్మిన చోటే కట్టెలు అమ్మాల్సిన పరిస్థితిని జీర్ణించుకోలేక రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్ రావు (బీఎమ్మార్) గురువారం వైసీపీకి, రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఈయన రాజీనామా నెల్లూరు జిల్లాలో ప్రధాన చర్చనీయాంశంగా మారింది. ఆ పార్టీ జిల్లా నాయకత్వంలో ఎదురవుతున్న అవమానాలను తట్టుకోలేక ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

రాజ్యసభ పదవికీ రాజీనామా

వైసీపీలో ఎన్నో అవమానాలు ఎదుర్కొన్న మస్తాన్‌రావు

టీడీపీలోకి ఆహ్వానించిన ఎంపీలు వేమిరెడ్డి, మాగుంట

అధిష్ఠానం పిలుపుతో రాజధానికి బీద రవిచంద్ర

బీఎమ్మార్‌ను తమ పార్టీలో చేర్చుకునేందుకు కమలనాథుల విశ్వప్రయత్నం?

జిల్లాలో మారుతున్న రాజకీయ సమీకరణలు

నెల్లూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ వ్యాపారవేత్తగా స్థిరపడిన బీద మస్తాన్‌రావు తెలుగుదేశం పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులై రెండున్నర దశాబ్దాల క్రితం ఆ పార్టీ ద్వారా రాజకీయ అరంగేట్రం చేశారు. టీడీపీలో క్రియాశీల నాయకుడిగా గుర్తింపు పొంది 2009లో కావలి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2019 ఎన్నికల్లో నెల్లూరు పార్లమెంట్‌కు పోటీ చేసి, ఓటమి చెందారు. టీడీపీలో అగ్రశ్రేణి నాయకుల్లో ఒకరిగా గుర్తింపు పొందారు. ఇంతగా గుర్తింపు పొందిన బీఎమ్మార్ వైసీపీలోకి వెళ్లిన తరువాత రాజకీయంగా అవమానాలను ఎదుర్కోవలసి వచ్చింది. వైసీపీ అధిష్ఠానం ఆదరించి 2022లో రాజ్యసభ సభ్యత్వం ఇచ్చినా ఆ పార్టీకి చెందిన కావలి నాయకులు, జిల్లా నాయకులు మాత్రం మస్తాన్‌రావును తమలో ఒకరిగా గుర్తించలేకపోయారు. ఎంపీ పదవిలో ఉన్నా చిన్నచూపే చూశారు. సీఎం హోదాలో జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాకు వచ్చిన సందర్భాల్లో మస్తాన్‌రావు వేదికపైకి ఎక్కే అవకాశం దొరక్క వెనక్కు వెళ్లిన సంఘటనలు ఉన్నాయి. ఇక దశాబ్దాల కాలం కావలి నియోజకవర్గంలో నెంబర్ వన్ నాయకుడిగా గుర్తింపు పొందిన ఈయనకు వైసీపీలో చేరిన తరువాత ఆ పార్టీ నాయకుల చేత అవమానాలు ఎక్కువయ్యాయి. కనీసం కావలిలో ఫ్లెక్సీలు కట్టుకోలేని దుస్థితిని సైతం బీఎంఆర్ ఎదుర్కొన్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో నెల్లూరు ఎంపీ స్థానానికి విజయసాయిరెడ్డి అభ్యర్థిగా ప్రకటించిన తరువాతే మార్చి, ఏప్రిల్ ఆ రెండు నెలలు బీఎంఆర్‌కు పార్టీలో గుర్తింపు లభించింది. ఆ తరువాత ఆ ఆదరణ లేకపోగా బీఎంఆర్ తన గెలుపునకు కృషి చేయలేదని, వెన్నుపోటు పొడిచారని కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌రెడ్డి అధిష్ఠానానికి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన మస్తాన్‌రావు మూడు నెలలుగా రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో గురువారం రాజ్యసభ సభ్యత్వానికి, వైసీపీ ప్రాథమిక సభ్యత్వానికి బీద మస్తాన్‌రావు రాజీనామా చేశారు.



● ఫలించిన వీపీఆర్ ప్రయత్నం

బీఎంఆర్ అసంతృప్తిని గమనించిన నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి టీడీపీ అధినేత నారా చంద్రబాబుకు విషయం తెలియజేశారు. వైసీపీని, ఆ పార్టీ ద్వారా సంక్రమించిన రాజ్యసభ సభ్యత్వాన్ని వదులుకునే క్రమంలో బీఎమ్మార్‌ను టీడీపీలోకి తెచ్చుకోవాలని ఆ పార్టీ అగ్రనేతలు నిర్ణయించుకున్నారు. ఈ మేరకు నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డిలు బీఎమ్మార్‌ను మాతృ పార్టీలోకి రావాలని ఆహ్వానించినట్లు తెలిసింది. ఈ విషయమై చర్చించడానికి ఆయన తమ్ముడు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్రకు పిలుపురావడంతో గురువారం ఉదయం ఆయన అమరావతికి చేరుకున్నారు. ఇదే సమయంలో తమిళనాడుకు చెందిన బీజేపీ నాయకులు, రాజ్యసభలోని బీజేపీ మిత్రులు బీఎంఆర్‌ను తమ పార్టీలోకి ఆహ్వానించినట్లు తెలుస్తోంది. ఒకటి రెండు రోజుల్లో రాజకీయంగా బీద మస్తాన్‌రావు కీలక ప్రకటన చేసే సూచనలు ఉన్నాయని విశ్వసనీయ సమాచారం.

జలజీవన్ పనులకు ప్రాధాన్యమివ్వండి

● పూర్తయిన పనులకు బిల్లులు సిద్ధం చేయండి ● జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో చైర్‌పర్సన్ ఆదేశం

నెల్లూరు (జడ్పీ), ఆగస్టు 29: జిల్లాలో ప్రతి ఇంటికి తాగునీటిని అందించాలన్న లక్ష్యంతో ఏర్పాటు చేసిన జలజీవన్ మిషన్ పనులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి త్వరితగతిన పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ ఇంజనీరింగ్ అధికారు లను ఆదేశించారు. గురువారం నెల్లూరులోని జిల్లా పరిషత్ కార్యాలయంలో చైర్‌పర్సన్ అధ్యక్షతన జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఇంజనీరింగ్ శాఖలపై సమగ్రంగా చర్చించారు. గత ప్రభుత్వంలో చేపట్టిన సచివాలయాలు, ఆర్బీకేలు, వివిధ భవనాలు, ఇతర పనులకు సంబంధించి బిల్లులు పెండింగ్ ఉన్నాయని, నాలుగేళ్లగా మొత్తుకుంటున్నా పూర్తయిన పనులకు బిల్లులు రాలేదని, ఇప్పటికైనా వాటిని మంజూరు చేయించాలని జడ్పీటీసీ సభ్యులు మల్లు సుధాకర్‌రెడ్డి, మాల్యాద్రి, వెంకట్రావు, రాఘవులు తదితర సభ్యులు విన్నవించారు. అలాగే రోడ్ల పనులు మంజూరైనా ఇంతవరకు టెండర్లు పిలవలేదని, ఎక్కడి పనులు అక్కడే ఉన్నాయని వాపోయారు. జలజీవన్ పనులు సక్రమంగా జరగలేదని, స్థానిక ఎంపీడీవోలు పనుల పర్యవేక్షణకు ప్రాధాన్యత ఇవ్వలేదని మండిపడ్డారు. దీంతో జడ్పీ చైర్‌పర్సన్, సీఈవో కన్నమనాయుడు మాట్లాడుతూ పనులు పూర్తయిన వాటికి ఎంబుక్‌ల రికార్డులను ఇంజనీరింగ్ అధికారులు సిద్ధం చేయాలన్నారు. పార్టీలకతీతంగా బిల్లులకు సంబంధించి రికార్డులను సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాలని సూచించారు. ప్రస్తుతం జలజీవన్ పనులపై సర్వే జరుగుతున్నందున ప్రజాప్రతి నిధులంతా మండలస్థాయిలో సమీక్షించి, ఆ పనుల్లో లోటుపాట్లను సరిదిద్దేందుకు సహకరించాలని కోరారు. ప్రతి ఇంటికి తాగునీటి కొళాయిని అందించేందుకు అధికారులంతా యుద్ధ ప్రాతి పదికన పనులు చేపట్టాలన్నారు. విడవలూరు జడ్పీటీసీ లక్ష్మయ్య మాట్లాడుతూ తీరప్రాంతాలలో మంచినీటి పథకాలకు కరెంటు సరఫరా సక్రమంగా ఉండదని, చేతిబోర్లు, ప్రజలకు ఉపయోగపడు తుండగా, కొంతకాలంగా అవి మరమ్మ తులకు గురయ్యాయన్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరికరాల మంజూరుకు ఉన్నతాధికారులు కృషి చేయాలని చైర్‌పర్సన్ సూచించారు.



జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో పాల్గొన్న చైర్‌పర్సన్ అరుణమ్మ, అధికారులు, సభ్యులు

● తాగునీటి పథకాలకు సౌరవిద్యుత్తు

జిల్లాలో పంచాయతీలకు విద్యుత్ బిల్లుల భారం నుంచి విముక్తి కలిగించేందుకు సౌరవిద్యుత్తు ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ సూచించినట్లు సీఈవో కన్నమనాయుడు జడ్పీటీసీలు, అధికారులకు తెలిపారు. తొలిగా మంచినీటి పథకాలకు అవసరమైన సౌర విద్యుత్తును వినియోగించుకునేందుకు ప్రతిపాదనలను సిద్ధం చేయించుకోవాలన్నారు. దీంతో బిల్లుల భారం పూర్తిగా తగ్గిపోతుందని తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు త్వరితగతిన ప్రతిపాదనలు సిద్ధం చేసుకుంటే వాటి మంజూరుకు నివేదికలను కలెక్టర్‌కు పంపడం జరుగుతుందన్నారు.

తెలుగు భాషోద్యమ పితామహుడు గిడుగు

● జయంతిలో కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (హరనాథపురం), ఆగస్టు 29 : తెలుగు భాషోద్యమ పితామహుడు గిడుగు వెంకట రామ్మూర్తి అని కలెక్టర్ ఆనంద్ కొనియాడారు. గురువారం తెలుగు భాషాదినోత్సవం, రామ్మూర్తి జయంతి సందర్భంగా కలెక్టరేట్‌లో గిడుగు చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. తెలుగు భాషకు రామ్మూర్తి ఎనలేని సేవ చేశారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో వ్యవహారిక భాషోద్యమానికి ఆయన మూలపురుషుడన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కార్తీక్, డీఆర్వో లవన్న, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.



గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్, జేసీ తదితరులు

విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించాలి

● ఐదు పాఠశాలలకు రాష్ట్రస్థాయి అవార్డులు : డీఈవో

నెల్లూరు (విద్య), ఆగస్టు 29 : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు వారిని క్రీడల్లో రాణించేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని డీఈవో రామారావు సూచించారు. జాతీయ క్రీడాదినోత్సవం సందర్భంగా నగరంలోని దర్గామిట్ట జడ్పీ బాలికోన్నత పాఠశాల ఆవరణలో గురువారం పలు పాఠశాలకు స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్సీ అవార్డులను అందించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడలను ప్రోత్సహిస్తుండడంతో జిల్లాలో ఐదు పాఠశాలలు రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందాయని చెప్పారు. 2023-24 విద్యా సంవత్సరానికి బీవీనగర్ కేఎన్ఆర్ నగరపాలక ఉన్నత పాఠశాల, బీవీఎస్ బాలికల ఉన్నత పాఠశాల, కోవూరు జడ్పీ బాలికోన్నత పాఠశాల, పాటూరు జడ్పీ ఉన్నత పాఠశాల, పొదలకూరు మండలం మహ్మదాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలను విద్యాశాఖ క్రీడా అవార్డులకు ఎంపిక చేసిందని చెప్పారు. ఆయా పాఠశాలల హెచ్ఎంలు, పీడీలకు అవార్డులను అందచేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవోలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



అవార్డులు అందుకుంటున్న పాఠశాలల ప్రతినిధులు

మేయర్ భర్తకు సుప్రీంలోనూ చుక్కెదురు

నెల్లూరు(సిటీ), ఆగస్టు 29 : నెల్లూరు నగర మేయర్ పోట్లూరి స్రవంతి భర్త జయవర్ధన్‌కు సుప్రీం కోర్టులోనూ భంగపాటు తప్పలేదు. పూర్వ కమిషనర్ ఐఏఎస్ అధికారి వికాస్ మర్మత్ సంతకం ఫోర్జరీ కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని భారత అత్యున్నత న్యాయస్థానాన్ని జయవర్ధన్ ఆశ్రయించారు. అయితే అతని అభ్యర్థనను న్యాయస్థానం గురువారం తిరస్కరించినట్లు అధికారిక వర్గాల ద్వారా తెలిసింది. ఇటీవల ఇదే అంశంపై ఏపీ హైకోర్టు తలుపు తట్టగా అక్కడా చుక్కెదురైన విషయం విదితమే. ప్రస్తుతం పరారీలో ఉన్న జయవర్ధన్‌ను అదుపులోకి తీసుకునేందుకు నెల్లూరు పోలీసులు గాలిస్తున్నారు. వారి అరెస్ట్ నుంచి తప్పించుకునేందుకు జయవర్ధన్ ముందస్తు బెయిల్ కోసం తీవ్రంగా శ్రమిస్తున్నారు. కాగా, అతనిని అదుపులోకి తీసుకోవడంపై పోలీసు వర్గాలు ఆశించినంతగా శ్రద్ధ చూపడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

● మరో టీపీవో అరెస్ట్

నెల్లూరు(క్రైం): సంతకాల ఫోర్జరీ కేసులో మరో అధికారి అరెస్ట్ అయ్యారు. కార్పొరేషన్ టౌన్‌ప్లానింగ్ అధికారి బీ ప్రవీణ్‌కుమార్‌ను నగర డీఎస్పీ డీ శ్రీనివాసరెడ్డి గురువారం అరెస్ట్ చేశారు. ఈ కేసులో ఇద్దరు టీపీవోలు, మేయర్ భర్త జయవర్ధన్, ఆయన సహాయకుడు, ఇద్దరు సచివాలయ ఉద్యోగులు, ప్రైవేటు ఇంజనీర్‌పై దర్గామిట్ట పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఇప్పటికే శివకృష్ణ, టీపీవో దేవేంద్రను పోలీసులు అరెస్ట్ చేశారు. తాజాగా కరెంట్ ఆఫీసు సెంటర్ వద్ద టీపీవో బీ ప్రవీణ్‌కుమార్‌ను అరెస్ట్ చేశారు.

జిల్లాలో ఇసుక కష్టాలు తీరనున్నాయి. ఒకటీ రెండు రోజుల్లో డీసిల్టేషన్ పాయింట్ల వద్ద ఇసుక తవ్వకాలు ప్రారంభం కానున్నాయి. సంగం బ్యారేజీకి రెండు వైపులా ఉన్న సంగం, సూరాయపాలెం పాయింట్లతో పాటు కోవూరు మండలం పోతిరెడ్డిపాలెం వద్ద నెల్లూరు బ్యారేజీకి సంబంధించి డీసిల్టేషన్ పాయింట్‌ను ఏర్పాటు చేశారు. వీటినుంచి డిమాండ్‌కు తగ్గట్టుగా ఇసుకను వేగంగా అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు యోచిస్తున్నారు. ఈ మేరకు కలెక్టర్ ఓ ఆనంద్ ఆధ్వర్యంలో గురువారం జరిగిన జిల్లాస్థాయి ఇసుక కమిటీ (డీఎస్ఎస్‌సీ)లో కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

● కొలిక్కి వచ్చిన టెండర్ల ప్రక్రియ
● 15 మంది కాంట్రాక్టర్లకు డ్రెడ్జింగ్ పనులు
● రేపటి నుంచి తవ్వకాలు జరపాలని నిర్ణయం
● యార్డుల్లో టన్ను ధర రూ.380గా ఖరారు
● డీఎల్ఎస్‌సీ సమావేశంలో కీలక నిర్ణయాలు
● మర్రిపాడు యార్డులో కరిగిన నిల్వలు

మర్రిపాడు యార్డులో మట్టిలో కలిసి పనికి రాని ఇసుక

జిల్లాలో ఇసుక కొరతను తీర్చేందుకు వేగంగా చర్యలు తీసుకుంటున్నాం. పెన్నా, సంగం బ్యారేజీల వద్ద డీసిల్టేషన్ చేసి ప్రాజెక్టుల వద్ద నీటి నిల్వ సామర్థ్యం పెంచడంతో పాటు అక్కడి ఇసుకను ప్రజలకు అందిస్తాం. ఇందుకు సంబంధించి ఆసక్తి కలిగిన బోట్స్‌మెన్ సొసైటీలను కూడా ఎంపానెల్ చేశాం. ఒకటి, రెండు రోజుల్లోనే డీసిల్టేషన్ పనులు మొదలవుతాయి.

- ఓ ఆనంద్,
జిల్లా కలెక్టర్

ఒకటీ రెండు రోజుల్లో ప్రారంభం



తీరనున్న ఇసుక కష్టాలు

నెల్లూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : యార్డుల్లో ఇసుక నిల్వలు తరిగిపోవడంతో గడిచిన కొన్ని రోజులుగా ఇసుకకు డిమాండ్ ఏర్పడింది. రీచ్‌లలో ఇసుక తవ్వకాలకు పర్యావరణ అనుమతులు రావడం ఆలస్యమవుతున్న నేపథ్యంలో ఎలాగైనా ఇసుక కొరత తీర్చాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలోనే బ్యారేజీల వద్ద డీసిల్టేషన్ పాయింట్లలో ఇసుక తవ్వకాలకు నిర్ణయం తీసుకుంది.

● 15 సొసైటీల ఎంపిక

పెన్నా, సంగం బ్యారేజీల వద్ద డ్రెడ్జింగ్ విధానంలో ఇసుక తవ్వకాలు జరపాల్సి ఉండటంతో అందుకు సంబంధించిన ప్రక్రియలను వేగంగా పూర్తి చేసింది. ఆసక్తి కలిగిన పడవలు కలిగిన సొసైటీల (బోట్స్‌మన్) నుంచి జిల్లా అధికారులు దరఖాస్తులు ఆహ్వానించారు. మొత్తం 15 సొసైటీలకు సంబంధించి 27 దరఖాస్తులు వచ్చాయి. జాయింట్ కలెక్టర్ కే కార్తీక్ నేతృత్వంలోని డీసిల్టేషన్ కమిటీ రెండు రోజులపాటు దరఖాస్తులను పరిశీలించి, 15 సొసైటీలను అర్హులుగా ప్రకటించింది. వీరందరూ బ్యారేజీల వద్ద డీసిల్టేషన్ చేసేందుకు సిద్ధం కావాలని అధికారులు సూచించారు.

● ట్రాక్టర్ ఇసుక రూ.1520

ఇక యార్డు నిర్వహణ, సీనరైజ్ చార్జీలు, డీఎంఎఫ్‌టీ, ఇతర చార్జీలు కలుపుకొని యార్డు వద్ద టన్ను ఇసుకను ప్రజలకు రూ.380కు విక్రయించేలా నిర్ణయం తీసుకున్నారు. అంటే ఒక ట్రాక్టర్ (నాలుగు టన్నులు) ఇసుక ధర రూ.1520కు యార్డుల వద్ద విక్రయిస్తారు. పోతిరెడ్డిపాలెం యార్డు నుంచి నెల్లూరు నగరం, రూరల్, కోవూరు, కావలి నియోజకవర్గాలకు దగ్గరగా ఇసుకను తీసుకెళ్లవచ్చు. అలానే సూరాయపాలెం నుంచి సర్వేపల్లి, వెంకటగిరి నియోజకవర్గాలకు, సంగం నుంచి ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాలకు ఇసుకను తక్కువ ధరకు (రవాణాతో కలిపి) తీసుకెళ్లేందుకు అవకాశం ఏర్పడుతుంది. కాగా అక్టోబరు 15 తర్వాత నుంచి ఇసుక రీచ్‌లలో తవ్వకాలు ప్రారంభం కానున్నాయి. అప్పుడు డ్రెడ్జింగ్, యార్డు నిర్వహణ వంటి చార్జీలు తగ్గిపోతున్నాయి. దీంతో ఇంకా తక్కువ ధరకు అప్పుడు ఇసుక లభిస్తుంది.

తవ్వి, తరలించినందుకు..

మూడు డీసిల్టేషన్ పాయింట్ల వద్ద ముందుకొచ్చిన కాంట్రాక్టర్లకు డ్రెడ్జింగ్ ద్వారా ఇసుకను తవ్వి తీసుకొచ్చేందుకు అవకాశం కల్పిస్తారు. ఇలా తవ్వి బోట్లలో తీసుకొచ్చిన ఇసుకను సమీపంలో ఏర్పాటు చేసిన యార్డుకు సదరు కాంట్రాక్టర్లే తరలించాల్సి ఉంటుంది. ఇందుకు గానూ టన్ను ఇసుకకు ధరను కూడా డీఎల్ఎస్‌సీ సమావేశంలో నిర్ణయించారు. సూరాయ పాలెంలో నదికి, యార్డుకు ఒక కిలోమీటర్ దూరం ఉండడంతో ఇక్కడ టన్నుకు రూ.125, పోతిరెడ్డిపాలెం వద్ద రెండు కి.మీ ఉండటంతో రూ.135, సంగం వద్ద 3 కి.మీ దూరం ఉండటంతో రూ.140 కాంట్రాక్టర్లకు ఇచ్చేలా నిర్ణయం తీసుకున్నారు.

● మర్రిపాడులో కరిగిన నిల్వలు

వైసీపీ ప్రభుత్వం పుణ్యమా అని ఇసుక రీచ్ లలో తవ్వకాలు చేయలేని పరిస్థితి నెలకొంది. నాడు పర్యావరణ అనుమ తులు లేకుండా విచ్చల విడిగా తవ్వకాలు జరిపి సొమ్ము చేసుకున్నారు. ఈ అక్రమాలపై జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్‌తోపాటు సుప్రీంకోర్టులో కూడా కేసులు నడుస్తున్నాయి. ఆ ప్రభావంతో రీచ్‌లలో తవ్వకాలు జరపలేక యార్డుల్లో నిల్వ ఉన్న ఇసుకనే ప్రభుత్వం అందించాల్సి వచ్చింది. అందులోనూ పల్లిపాడు, మినగల్లు యార్డుల్లో తక్కువ క్వాంటిటీ ఉండడంతో రెండు వారాల్లోనే అక్కడి యార్డులు ఖాళీ అయ్యాయి. మర్రిపాడులో మాత్రం 1.20 లక్షల టన్నుల ఇసుక నిల్వలు ఉండడంతో ఇప్పటివరకూ అక్కడి నుంచే జిల్లా అవసరాలు తీరుతూ వచ్చాయి. కానీ ప్రస్తుతం ఆ యార్డులో అధికారికంగా 25 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే ఇసుక నిల్వలు ఉన్నాయి. అందులోనూ దాదాపు 15 వేల టన్నుల వరకూ గ్రౌండ్ లాస్ (మట్టి కలిసిన ఇసుక), లోడింగ్ లాస్(ఎలక్ట్రానిక్ కాటా లేకపోవడంతో జరిగిన నష్టం) ఉన్నాయి. ఇక మిగిలింది దాదాపు 10 వేల టన్నులు మాత్రమే. ప్రస్తుతం సోమశిల జలాశయం అప్రాన్ పనులు జరుగుతుండటంతో అక్కడకు మరో 13 వేల టన్నుల ఇసుక అవసరం కానుంది. ఇప్పుడున్న మిగిలి ఉన్న ఇసుకను సోమశిలకు తరలించే విధంగా అధికారులు నిర్ణయం తీసుకున్నారు. దీంతో మర్రిపాడు యార్డులో ఇసుక విక్రయాలు నిలిచిపోయాయి.

గ్రామాల్లో క్రీడల ప్రోత్సాహానికి చర్యలు

● జాతీయ క్రీడాదినోత్సవంలో కలెక్టర్ ఆనంద్



ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (విద్య), ఆగస్టు 29 : జిల్లాలో గ్రామీణ స్థాయిలో క్రీడల ప్రోత్సాహానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ ఓ ఆనంద్ తెలిపారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం నుంచి కరెంటాఫీస్ సెంటర్ వరకు క్రీడాకారులు, విద్యార్థులతో నిర్వహించిన ర్యాలీని కలెక్టర్ ప్రారంభించారు. తొలుత స్టేడియంలో హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. క్రీడాకారులతో ప్రతిజ్ఞ చేయించారు. జిల్లాలో జరుగుతున్న స్టేడియాల నిర్మాణం పూర్తికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. మొగళ్లపాళెంలో అన్ని హంగులతో పూర్తయిన మల్టీపర్పస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. అలాగే ఉపాధి హామీ పనుల్లో భాగంగా జిల్లాలోని వివిధ పాఠశాలల్లో మైదానాలను అభివృద్ధి చేస్తామన్నారు. క్రీడాకారులు వనరులను సద్వినియోగం చేసుకుని పోటీల్లో రాణించాలని పిలుపునిచ్చారు. అనంతరం క్రీడాకారులు, క్రీడా సంఘాలు, వాకర్స్ సంఘాలు, విద్యార్థులతో కలిసి ర్యాలీలో పాల్గొని అందరినీ ఉత్సాహపరిచారు. వివిధ క్రీడాంశాల్లో గెలుపొందిన వారికి బహుమతులు, సర్టిఫికెట్లు అందచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఆర్‌కే యతిరాజ్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పెంచలయ్య, జిల్లా బీసీ సంక్షేమాధికారి వెంకటయ్య, జిల్లా ఒలంపిక్ సంఘం కార్యదర్శి గురు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వన మహోత్సవం

కొత్తూరు నగరవనంలో ఏర్పాట్లు పూర్తి

నెల్లూరు (వెంకటేశ్వరపురం) : రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం వన మహోత్సవం జరగనుంది. జిల్లాలో నెల్లూరు నగర శివారు ప్రాంతమైన కొత్తూరులోని నగరవనంలో అటవీశాఖ ఈ కార్యక్రమం నిర్వహించనుంది. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ప్రతీ ఒక్కరూ ఒక మొక్క నాటాలి అన్న ప్రధాన అజెండాతో వన మహోత్సవం ప్రారంభించనున్నారు. డిసెంబరు 31లోగా జిల్లాలో 30లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖలు, విద్యాసంస్థలు, ప్రజలు పచ్చదనం పెంపునకు మొక్కలు నాటి సహకరించాలని అటవీశాఖ అధికారులు పిలుపునిచ్చారు.

'దిశ'.. ఇక మహిళా పోలీసు స్టేషన్

నెల్లూరు (క్రైం) : గత ప్రభుత్వంలో ఏర్పాటయిన దిశ పోలీసు స్టేషన్‌ను మహిళా పోలీసు స్టేషన్‌గా పేరు మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. వైసీపీ అధికారంలోకి రాక ముందు నగరంలోని వీఆర్సీ సెంటర్ వద్ద ప్రస్తుత చిన్నబజారు పోలీసుస్టేషన్ ముందు మహిళా పోలీసు స్టేషన్ ఉండేది. ఆ తర్వాత దిశ పోలీసు స్టేషన్‌గా పేరు మార్చి జీజీహెచ్ ప్రాంగణంలోకి మార్చారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం రాగానే దిశ స్టేషన్‌ను మహిళా పోలీసు స్టేషన్‌గా మార్పు చేసింది.

రేపే 'భరోసా' పింఛన్ల పంపిణీ

నెల్లూరు(హరనాథపురం) : ఎన్టీఆర్ భరోసా పేరుతో పంపిణీ చేసే సామాజిక పింఛన్లను సెప్టెంబరు నెలకు సంబంధించి శనివారమే లబ్ధిదారులకు అందజేయనున్నారు. ఒకటో తేదీ ఆదివారం సెలవుదినం కావడంతో బ్యాంకుల వారీగా ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. 3.10 లక్షల మంది పింఛనుదారులకు రూ.131.41 కోట్ల పెన్షన్ ఇవ్వాల్సి ఉంది. ఈ మొత్తాన్ని సచివాలయ అడ్మిన్లు బ్యాంకుల నుంచి డ్రాచేసి పెన్షన్‌దారులకు పంపిణీ చేస్తారు. పింఛనుదారులు ఇళ్ల వద్దనే ఉండి పెన్షన్ తీసుకోవాలని కలెక్టర్ ఆనంద్ ఓ ప్రకటనలో కోరారు.

ముగ్గురి మృతితో చుంచులూరులో విషాదం


మృతి చెందిన శ్రీనివాసులు, పుష్ప, శ్రీకాంత్ (ఫైల్)

మర్రిపాడు, ఆగస్టు 29: కర్ణాటకలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని చుంచులూరు గ్రామానికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన బోటిక శ్రీనివాసులు (50), భార్య పుష్ప(45), కుమారుడు శ్రీకాంత్(26) ముగ్గురు దుర్మరణం చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. వీరు బంధువుల వివాహానికి బుధవారం సాయంత్రం కారులో గ్రామం నుంచి బయలుదేరి వెళ్లారు. కర్ణాటకలోని చింతామణి సమీపాన దండు పాళ్యం గేటు వద్ద ఎదురు వస్తున్న టెంపో వీరి కారును ఢీకొనడంతో ముందుభాగం నుజ్జు నుజ్జు కావటంతో అందులోని ముగ్గురు అక్కడిక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతదేహాలను పంచనామా నిర్వహించిన అనంతరం మృతుల బంధువులు గురువారం సాయంత్రం స్వగ్రామం చుంచులూరుకు తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. మృతులు బెంగుళూరులో శుభకార్యాలయాలకు ఈవెంట్‌లు చేసుకుంటూ కొన్నేళ్లగా అక్కడే నివసిస్తున్నారు. వీరికి కార్తీక్ అనే మరో కుమారుడు ఉన్నారు.

స్నేహితులే హంతకులు!

● చంపేస్తాడన్న భయంతో హత్య ● నిందితుల అరెస్ట్


నిందితుల వివరాలు తెలుపుతున్న నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

నెల్లూరు (క్రైం), ఆగస్టు 29: నెల్లూరులో కలకలం రేపిన పాత నేరస్థుడు గుంజి రవి అలి యాస్ కత్తి రవి హత్య కేసులో నిందితులను బాలాజీనగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. చంపేస్తాడేమో అన్న భయంతో రవిని స్నేహితులే కత్తులతో పొడిచి పొడిచి దారుణంగా హత్య చేశారని తెలిపారు. ఆ వివరాలను గురువారం బాలాజీనగర్ పోలీసు స్టేషన్‌లో నగర డీఎస్పీ డీ శ్రీనివాసరెడ్డి, ఇన్‌స్పెక్టర్ కే సాంబశివరావుతో కలిసి మీడియాకు వెల్లడించారు. నగరంలోని జనశక్తినగర్‌కు చెందిన గుంజి రవి(32) కొంతకాలంగా శ్రీకాళహస్తిలోని దక్షిణ కైలాసనగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఈ నెల 25న స్నేహితుని ఇంట్లో వివాహ కార్యక్రమంలో పాల్గొనేందుకు నెల్లూరు వచ్చాడు. వివాహానంతరం స్నేహితులైన చంద్రమౌళి నగర్‌కు చెందిన సాయితేజ అలియాస్ కమ్మసాయి, వెంకటరెడ్డినగర్‌కు చెందిన వెంకటేష్ అలియాస్ వెంకీడాన్, చంద్రమౌళీనగర్‌కు చెందిన వంశీకృష్ణ అలియాస్ నిప్పోసాయి, పవన్ కుమార్ అలియాస్ పవన్, నారాయణతో కలిసి మద్యం సేవించాడు. రవికి పాత వేదాయ పాళెం ప్రాంతానికి చెందిన సుజన్ కృష్ణ అలియాస్ చింటూతో ఫోన్‌లో మాట్లాడుతుండగా మాటామాటా పెరిగింది. ఇద్దరూ గొడవ పడ్డారు. ఈ క్రమంలో రవి కమ్మసాయి భార్యకు ఫోన్‌చేసి అసభ్యకర పదజాలంతో దూషించాడు. రవి కోపంలో చింటూను చంపేస్తాడని కమ్మసాయి, వెంకీడాన్, నిప్పోసాయి, పవన్, నారాయణలు భావించారు. చింటూను కలుపుకొని రవిని హత్యచేయాలని నిర్ణయించుకున్నారు. రామలింగాపురం అండర్‌బ్రిడ్జీ సమీపంలో చింటూ రవితో గొడవపడుతుండగా మిగిలిన నిందితులు బైకులపై వచ్చి కత్తులతో విచక్షణ రహితంగా రవిని హత్యచేసి పరారయ్యారు. ప్రత్యక్ష సాక్షి రవితేజ ఫిర్యాదు మేరకు బాలాజీనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. సాంకేతికత ఆధారంగా గురువారం నిందితులను అరెస్ట్ చేసి వారి నుంచి రెండు మోటారుబైక్‌లు, నాలుగు కత్తులను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ వెల్లడించారు. నిందితులందరూ పాత నేరస్థులేనని తెలిపారు. హత్య కేసును ఛేదించిన బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్ కే సాంబశివరావు, ఎస్‌ఐ విజయశ్రీవాస్, హెచ్‌సీలు జయరామయ్య, సుధాకర్‌రావు, శివకుమార్, తదితరులను ఎస్పీ అభినందించారని డీఎస్పీ తెలిపారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైం), ఆగస్టు 29: నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్ సమీపంలో గురువారం రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. రైల్వే పోలీసుల సమాచారం మేర కు... సుమారు 50 ఏళ్ల వ్యక్తి మృతి చెందాడు. మృతదేహంపై తెలుపు రంగు హాఫ్‌హ్యాండ్స్ షర్ట్, తెలుపు, బులుగు రంగు గళ్ల లుంగీ ఉన్నాయని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	110
లేయర్ లైవ్	105
స్కిన్ చికెన్	204
స్కిన్‌లెస్	224
లేయర్	178

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.6910
వెండి కిలో ధర	రూ. 87,600
వెండి ఒక గ్రాము	రూ. 90.60

మహిళా సంరక్షణ కార్యదర్శులకు నేడు కౌన్సెలింగ్

నెల్లూరు(క్రైం),ఆగస్టు 29: జిల్లాలోని గ్రామ, వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శులకు శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ఎస్పీ జీ కృష్ణకాంత్ గురువారం ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న మహిళా సంరక్షణ కార్యదర్శులందరూ ఆన్‌లైన్‌లో పొందుపరిచిన సర్టిఫికెట్ల ఒరిజినల్స్‌తో ఉదయం 9 గంటలకు జిల్లా పోలీసు కార్యాలయంలో హాజరుకావాలని సూచించారు.

కసుమూరు దర్గాలో ఇదేం విడ్డూరం!

● కాసులు ఇవ్వకుంటే దాడులు చేస్తారా!?
● కొందరు ముజావర్లపై విమర్శల వెల్లువ
● పోలీసులకు, వక్ఫ్‌బోర్డు అధికారులకు ఫిర్యాదులు
● సీసీ కెమెరాలు పరిశీలిస్తే వాస్తవాలు వెలుగులోకి..
● విచారించి చర్యలు తీసుకోవాలంటున్న భక్తజనం

దక్షణాది రాష్ట్రాల్లోనే ఎంతో ప్రాచుర్యం ఉన్న కసుమూరు మస్తాన్ వలీ దర్గాలో కొందరు ముజావర్ల వ్యవహారశైలిపై భక్తులు మండిపడుతున్నారు. ఎంతో భక్తితో మొక్కులు తీర్చుకునేందుకు వస్తున్న తమపై వారు దాడులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఓ ముజావర్ కాసుల కోసం భక్తుడిపై దాడికి ఎగబడ్డారు. పవిత్ర దర్గాలో ఈ తంతు జరుగుతున్నా అటు వక్ఫ్‌బోర్డు, ఇటు పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.


కసుమూరు దర్గా

వెంకటాచలం, ఆగస్టు 29 : కసుమూరు దర్గాలో మాంసాహారాన్ని చదివింపులు ఇవ్వడం ఆనవాయితీ. భక్తులు దర్గాకు వచ్చి కోడి, పొట్టేలు మాంసంతో బిర్యానీ వండి కొంతమొత్తాన్ని దర్గాలో చదివింపులు ఇస్తారు. ఈ వంట కాన్ని దర్గాలోని ముజావర్లు (పూజా రులు) తీసుకోవడం సంప్రదాయం. ఈ ప్రక్రి యను స్థానికులు ఫాతెహా అంటారు. ఈ ఫాతె హా విషయంలోనే ముజావర్లు భక్తులకు చుక్కలు చూపుతున్నారు. ఎంతో భక్తిశ్రద్ధలతో చేసిన ప్రసా దాన్ని దర్గాలో చదివింపులు ఇవ్వకుంటే అరిష్టమని భావించి ముజావర్ల డిమాం డ్లకు భక్తులు తలొగ్గుతున్నారు. వారి డిమాం డ్లను నిరాకరించిన భక్తులపై కొందరు ముజావర్లు, వారి అనుచరులు దాడికి పూనుకోవడం, అసభ్యకరంగా నోటికి వచ్చినట్లు మాట్లాడటం పరిపాటిగా మారింది.

● ఐదేళ్లలో 16కుపైగా ఫిర్యాదులు

ముజావర్ల బలవంతపు వసూళ్లు, దాడులపై గడిచిన ఐదేళ్లలో వెంక టాచలం పోలీస్‌స్టేషన్ లో 16కుపైగా ఫిర్యాదులు అందాయి. చాలా మంది భక్తులు దర్గా ఆవరణలో ఉన్న వక్ఫ్‌బోర్డు కార్యాలయంలో ఫిర్యాదులు చేసి వెళ్లి పోతున్నారు. ఈ ఏడాదిలోనే ఇప్పటి వరకు 5కుపైగా ఫిర్యాదులు పోలీసులకు అందాయి. ఇప్పటికైనా పోలీసులు చొరవ తీసు కొని ఇలాంటి దాడులు, బల వంతపు వసూళ్లు లేకుండా చర్యలు చేపట్టి దర్గా ప్రతిష్ఠను కాపాడాలని భక్తులు వేడుకుంటున్నారు.

● విచ్చలవిడిగా వసూలు

సుమారు 4 నెలల నుంచి హుండీ నిర్వహణ బాధ్యతను వక్ఫ్‌బోర్డు ప్రతినిధులే చూసుకుంటున్నారు. దీంతో దర్గాలో ముజావర్లు వారి ఇష్టానుసరంగా భక్తులపై దాడికి దిగడం, నోటికి వచ్చినట్లు దూషించడం వంటి చర్యలకు పూనుకుంటున్నారు. భక్తులు కాసులు (దక్షణం) ఇచ్చే వరకు పీడుస్తున్నారు. దర్గాలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిస్తే వాస్తవాలు వెలుగు చూస్తాయి. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కసుమూరు దర్గాపై ప్రత్యేక దృష్టి సారించి బలవంతపు వసూళ్లు జరగకుండా చూడాలని గ్రామస్థులు కోరుతున్నారు.


చర్యలు తీసుకుంటాం

ఈ మధ్యనే నేను సీఐగా బాధ్యతలు తీసుకున్నాను. కసుమూ దర్గాలో భక్తులకు ఎదురవు తున్న సమస్యలపై దృష్టి పెడతా. వక్ఫ్‌బోర్డు అధికారులతో చర్చించి దర్గా ముజావర్లతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి వీలైనంత త్వరలో సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటాను. ఎవరైనా బలవంతపు వసూళ్లకు పాల్పడిన, భక్తులపై దాడులు చేసినా కఠినంగా వ్యవహరిస్తాము.

- సీఐ సుబ్బారావు

ఫైర్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా చంద్రశేఖర్


చంద్రశేఖర్

నెల్లూరు(క్రైం), ఆగస్టు 29: ఆంధ్రప్రదేశ్ స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ ఫైర్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా నెల్లూరు జిల్లా అగ్నిమాపక శాఖ కానిస్టేబుల్ కే చంద్రశేఖర్ విజయం సాధించారు. అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ ఎన్నికలు గుంటూరు జిల్లా రెవెన్యూ కల్యాణ మండపంలో జరిగాయి. 23 పదవులకు 46 నామినేషన్లురాగా బ్యాలెట్ విధానంలో ఎన్నికలు జరిపారు. 11 రౌండ్ల ఓట్ల లెక్కింపులో రాష్ట్ర అధ్యక్షుడిగా చంద్రశేఖర్ 193 ఓట్లతో రెండవ సారి విజయం సాధించారు. నెల్లూరు నుంచి ఆర్గనైజింగ్ కార్యదర్శిగా స్టేట్ బాడీ ప్యానెల్‌కు పీ రాజేంద్ర ప్రసాద్ ఎన్నికయ్యారు.

హెల్త్ ఎడ్యుకేటర్స్ సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నిక

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 29 : ఆంధ్రప్రదేశ్ హెల్త్ ఎడ్యుకేటర్స్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గ ఎన్నిక గురువారం నెల్లూరులో జరిగింది. ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు చేజెర్ల సుధాకర్‌రావు ఆధ్వర్యంలో నూతన కమిటీ ఎన్నిక జరిగింది. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా నున్నా హరిప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా బట్టేపాటి అశోక్, కోశాధికారిగా ఆరోగ్య మేరీ, అసోసియేట్ అధ్యక్షురాలిగా బీబీజాన్, ఉపాధ్యక్షులుగా రమేష్, వెంకటసుబ్బయ్య, వెంకటేశ్వర్లు, సునీత ఎన్నికయ్యారు. ఉప కార్యదర్శులుగా చంద్రశేఖర్, ఉమర్, సుభాషిణి ఎన్నికయ్యారు.

సాగరం చెరువు అలుగు ధ్వంసం

అనంతసాగరం, ఆగస్టు 29: స్థానిక చెరువు అలుగు కాంక్రీట్ నిర్మాణాన్ని మూడు చోట్ల గురువారం కొందరు ధ్వంసం చేశారు. రెండేళ్ల క్రితం రూ.కోటి నాబార్డు నిధులతో చెరువు ఈ నిర్మాణ పనులు చేపట్టారు. అలుగు పారే వరకు నీరు చెరువులో చేరితే తమ పొలాలు ముంపునకు గురవుతున్నాయని ఉద్దేశ్యపూర్వకంగా చేసి ఉంటారని అనుమానం గ్రామస్థులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. విషయాన్ని ఇరిగేషన్ ఏఈ ఖాదర్‌కు వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

పొదలకూరు-సోమశిల రోడ్డుకు శాశ్వత మరమ్మతులు


దెబ్బతిన్న రోడ్డును పరిశీలిస్తున్న ఆర్అండ్‌బీ ఎస్ఈ గంగాధర్

కలువాయి, ఆగస్టు 29 : రాజుపాళెం సమీపంలోని పరమానంద ఆశ్రమం వద్ద దెబ్బతిన్న పొదలకూరు-సోమశిల రోడ్డుకు శాశ్వత మరమ్మతులు చేపట్టేందుకు చీఫ్ ఇంజనీరుకు ప్రతిపాదనలు పంపినట్లు, అనుమతి వచ్చిన వెంటనే పనులు పూర్తి చేస్తామని రోడ్లు, భవనాలశాఖ ఎస్ఈ గంగాధర్ తెలిపారు. కండలేరు కాలువ లీకేజీతో దెబ్బతిన్న రోడ్డును గురువారం ఆయన పరిశీలించి మాట్లాడారు. దెబ్బతిన్న రోడ్డుకు ప్రత్యామ్నాయంగా డైవర్షన్ రోడ్డును వెంటనే సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బంది లేకుండా డైవర్షన్ రోడ్డులో వాహనాల రాకపోకలు కొనసాగుతాయన్నారు. ఆయన వెంట ఆత్మకూరు డీఈ మదన్‌కుమార్ తదితరులు ఉన్నారు.

మాతృభాష గొప్పతనం మరువలేం : మాడభూషి


మాట్లాడుతున్న ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం డైరెక్టర్ మాడభూషి సంపత్‌కుమార్

వెంకటాచలం, ఆగస్టు 29: ఎన్ని శాస్త్రాలు చదివినా మాతృభాష గొప్పతనాన్ని మరువలేమని ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం డైరెక్టర్ మాడభూషి సంపత్‌కుమార్ అన్నారు. మండలంలోని చవటపాళెం పంచాయతీ సరస్వతి నగర్ వద్ద ఉన్న ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రంలో గురువారం తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాడభూషి సంపత్‌కుమార్ విచ్చేసి మాట్లాడుతూ తెలుగు భాషా పరిరక్షణకు ఏర్పడిన తెలుగు ప్రాచీన కేంద్రం తెలుగువారి సమస్త విషయాల విశిష్టతను, ప్రాచీనతను వెలికితీసి భావితరాలకు అందిస్తోందన్నారు. సుప్రసిద్ధ రచయిత డాక్టర్ చంద్రలత మాట్లాడుతూ తెలుగు భాషా ఔన్నత్యాన్ని దశదిశలా చాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ ఈశ్వరరెడ్డి, పవన్‌కుమార్, డాక్టర్ గిరి, డాక్టర్ కరుణశ్రీ, డాక్టర్ వై దివ్య, చిన్ని నారాయణరావు, రామచంద్రప్రసాద్, డాక్టర్ రాఘరామయ్య తదితరులు పాల్గొన్నారు.

సోమశిల జలాశయం సందర్శన


ఇంజనీర్లకు సూచనలు ఇస్తున్న ఎస్ఈ వెంకటరమణారెడ్డి

అనంతసాగరం, ఆగస్టు 29: సోమశిల జలాశయాన్ని గురు వారం ఎస్ఈ వెంకటరమణా రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆప్రాన్‌లో జరుగుతున్న పనులు తీరుపై ఆరా తీశారు. ప్రొటెక్షన్ వాల్ నిర్మాణ పనులపై ఇంజనీర్లకు సూచనలిచ్చారు. క్రస్టుగేట్లు, విద్యుత్ వ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. తొలుత తెలుగు గంగ వరద కాలువ ద్వారా పరమానంద ఆశ్రమం ఎగువన కొనసాగుతున్న లీకేజీలను పరిశీలించారు. కార్యక్రమంలో ఈఈ దశరథ రామి రెడ్డి, డీఈలు, జేఈలు, డిజైనింగ్ అధికారులు ఉన్నారు. కాగా, సోమశిలకు 12,501 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, 35.127 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

కార్పొరేషన్‌లో టీపీవో ప్రసాద్ బదిలీ

ఆత్మకూరు కమిషనర్‌గా గంగాప్రసాద్

నెల్లూరు(సిటీ) : నెల్లూరు కార్పొరేషన్‌లో టౌన్ ప్రాజెక్టు అధికారి ఏ ప్రసాద్‌ను చిత్తూరు కార్పొరేషన్ సహాయ కమిషనర్‌గా బదిలీ చేస్తూ రాష్ట్ర పురపాలక శాఖ గురువారం ఉత్తర్వులిచ్చింది. ప్రసాద్‌ను డిప్యుటేషన్‌పై పంపుతూ ఆ శాఖ తన ఉత్తర్వుల్లో పేర్కొంది. ఇక ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్‌గా సూళ్లూరుపేట కమిషనర్‌గా పని చేస్తున్న సీ గంగాప్రసాద్‌ను నియమించారు. ఆత్మకూరులో ఉన్న కమిషనర్ షేక్ ఫాజుల్లాను పురపాలక శాఖ డైరెక్టర్ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ప్రభుత్వ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి అనిల్‌కుమార్ సింఘాల్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

వచ్చే ఏడాది మార్చి కల్లా ఇళ్ల నిర్మాణం పూర్తి చేయించండి!

● ఆ తర్వాత బిల్లులు, కొత్త ఇళ్లూ రావు
● అధికారులకు కలెక్టర్ ఆదేశం


ఆగిన ఇళ్ల నిర్మాణాలపై లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 29 : వచ్చే ఏడాది మార్చి 25వ తేదీకల్లా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయకుంటే బిల్లులు, కొత్త ఇల్లు రావని కలెక్టర్ ఓ ఆనంద్ స్పష్టం చేశారు. ఈ మేరకు లబ్ధిదారులు, కాంట్రాక్టర్లు ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గురువారం నగర పంచాయతీ పరిధిలోని కట్టుబడిపాళెంలో ప్రభుత్వ లేఔట్-1లో ఇళ్ల నిర్మాణాలను కలెక్టర్ పరిశీలించారు. ఇళ్ల నిర్మాణాలు ఆగిపోవడానికిగల కారణాలు అడిగేందుకు ఒక్క లబ్ధిదారు కూడా లేకపోవడంతో ఇంజనీరింగ్ అసిస్టెంట్ల తీరుపై మండిపడుతూ అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. గతంలో మంజూరైన నిధుల మేరకు లబ్ధిదారులను ప్రోత్సహించి ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలని ఆదేశించారు.

● అరకొర నిధులతో అప్పుల పాలయ్యాం

గత ప్రభుత్వంలో ఇచ్చిన అరకొర నిధులు సరిపోక అప్పులు చేసి ఇల్లు కట్టి అప్పులపాలయ్యామని పలువురు లబ్ధిదారులు కలెక్టర్ ఎదుట ఏకరువు పెట్టారు. లే అవుట్లో మంచినీరు విద్యుత్ సరఫరా, పైపులైన్లు, ఇంటి బిల్లులు వంటి సమస్యలను వివవరించారు. అవసరమైన వారికి పొదుపు రుణాలు ఇప్పించి, సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డిని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట తహసీల్దారు అంబటి వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ నరసింహరావు, హౌసింగ్ పీడీ దయాకర్, డీఈ వెంకటేశ్వర్లురెడ్డి, ఏఈ పెంచలయ్య, విద్యుత్ ఏఈ, మెప్మా ఆర్‌పీ నర్మద, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వీఆర్వోలు తదితరులు ఉన్నారు.

5 కి.మీ మారథాన్ పరుగు

● ఉత్సాహంగా పాల్గొన్న యువత, ట్రాన్స్‌జెండర్లు


జెండా ఊపి పరుగు పోటీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో పెంచలయ్య

నెల్లూరు(వైద్యం) ఆగస్టు 29 : జిల్లా హెచ్ఐవీ, ఎయిడ్స్ నియంత్రణ శాఖ, స్పోర్ట్స్ అథారిటీ, రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో 5 కిలోమీటర్ల మారథాన్ పరుగు పోటీ గురువారం నెల్లూరులో జరిగింది. ఏసీ స్టేడియం నుంచి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి బొమ్మ వరకు, అక్కడి నుంచి తిరిగి ఏసీ స్టేడియం వరకు ఈ పరుగు సాగింది. దీనిని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో యువత, ట్రాన్స్‌జెండర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. గెలుపొందిన వారికి కలెక్టర్ ఆనంద్ బహుమతులు అందచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హెచ్ఐవీ, ఎయిడ్స్ నియంత్రణకు వైద్య ఆరోగ్యశాఖ విస్తృతంగా కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలి, స్పోర్ట్స్ అథారిటీ అధికారులు పాల్గొన్నారు.

పీకేపాడు రీచ్ అక్రమాలపై ఏసీబీ దృష్టి

● విచారణ చేసిన సిబ్బంది

అనంతసాగరం, ఆగస్టు 29: గత వైసీపీ సర్కార్ హయంలో పడమటికంభంపాడు ఇసుక రీచ్‌లో జరిగిన అక్రమాలపై ఏసీబీ దృష్టి సారించింది. డీఎస్పీ శిరీష ఆదేశాలతో ఇద్దరు ఉద్యోగులు గురువారం స్థానిక వీఆర్వోలు నాగేంద్ర, ప్రభాకర్‌తో కలిసి రీచ్‌ను తనిఖీ చేశారు. అనంతరం పీకేపాడులో స్థానికులతో మాట్లాడి వివరాలు రాబట్టారు. గత ప్రభుత్వంలో విచ్చలవిడిగా యంత్రాలతో ఇసుక తవ్వకాలు జరిపి లారీలతో ఇతర రాష్ట్రాలకు ఇసుక రవాణా చేశారని ఈ సమస్యతో తమ పొలాల్లో భూగర్భ జలాలు తగ్గాయని వివరించారు. ఇసుక దోపిడీపై పలుమార్లు ఆందోళనలు చేసిన తవ్వకాలు మాత్రం ఆపలేదన్నారు. స్థానికులు, వీఆర్వోలు ఇచ్చిన నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు.

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

ఘనంగా తెలుగు భాషా, జాతీయ క్రీడా దినోత్సవం

భాషా శాస్త్రవేత్త గిడుగు రామ్మూర్తికి, మేటి క్రీడాకారుడు ధ్యాన్‌చంద్‌కి పలువురి నివాళులు

జిల్లా వ్యాప్తంగా గురువారం తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వివిధ పాఠశాలలు, కళాశాలల్లో పలు కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా భాషా శాస్త్రవేత్త గిడుగు రామ్మూర్తి, మేటి క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. వారి సేవలను స్మరించుకున్నారు. ఆ వివరాలు..



కందుకూరు : టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగుభాష, జాతీయ క్రీడా దినోత్సవంలో మాట్లాడుతున్న అధ్యాపకురాలు


కావలి : గిడుగు రామ్మూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంఈవోలు, ఉపాధ్యాయులు


లింగసముద్రంలో..


వలేటివారిపాలెంలో విద్యార్థులు, టీచర్ల ర్యాలీ

కావలిటౌన్, ఆగస్టు29: పట్టణంలో గురువారం తెలుగుభాషా దినోత్సవం ఘనంగా జరిగింది. ఎంఈవో కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంఈవో-1 గోవిందయ్య, ఎంఈవో-2 వెంకటసుబ్బయ్య గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. జేబీ డిగ్రీ కళాశాలలో తెలుగు శాఖాధి పతి పీ నారాయణ అధ్యక్షతన జరిగిన భాషా దినోత్సవంలో ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యంనాయుడు, సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల సంచాలకుడు ఆర్ మాల్యాద్రి, అధ్యాపకులు రమణ తదితరులు పాల్గొని గిడుగు చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అలాగే పట్టణ పరిధిలోని పాఠశాలల్లో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

కందుకూరు : పట్టణంలోని టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జూనియర్ కళాశాలల్లో తెలుగు భాషా దినోత్సవాన్ని, క్రీడాదినోత్సవాన్ని వేర్వేరుగా నిర్వహించారు. డిగ్రీ కళాశాలలో వైస్‌ప్రిన్సిపాల్ డాక్టరు నరేంద్ర ఏడుకొండలు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అధ్యాపకులు తెలుగుభాషాభివృద్ధిపై మాట్లాడారు. ఈ సందర్భంగా గిడుగు రామమూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అలాగే మేటి క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా నిర్వహించిన వివిధపోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టరు ఎం. రవికుమార్, అధ్యాపకులు రాజగోపాల్‌బాబు, నరేష్‌రాజా, కే సుజాత, షానాజ్‌బేగం తదితరులు పాల్గొన్నారు. టీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఓరుగంటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కవితలు, పద్యాలు, ప్రాచీన తెలుగుభాష గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు.

● **తెలుగు ఉపాధ్యాయులకు సన్మానం**

కందుకూరు మండలంలోని ఓగూరు వద్ద ఉన్న సిద్ధార్థ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా తెలుగు ఉపాధ్యాయులను సన్మానించారు. తెలుగు ఉపాధ్యాయుడు ఇనకొల్లు మస్తానయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గిడుగు వెంకట రామమూర్తికి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం విశ్రాంత తెలుగు పండితులు గుర్రం వెంకటస్వామి, తెలుగు ఉపాధ్యాయిని ఏ. శ్రీవాణిలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తెలుగులో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

లింగసముద్రం : మండలంలోని పెంట్రాల యూపీ పాఠశాలలో గురువారం గిడుగు రామ్మూర్తి, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు.అనంతరం తెలుగు ఉపాధ్యాయురాలు హైమారాణి మాట్లాడారు.

కార్యక్రమంలో ఉపాధ్యాయులు కే మోహన్‌రావు, శ్రీనివాస్ ఆచారి, కే వెంకటేశ్వర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

వలేటివారిపాలెం : గ్రామంలోని హైస్కూల్‌లో గురువారం తెలుగుభాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, టీచర్లు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కమల్‌కుమార్ మాట్లాడారు. ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అల్లూరు : తెలుగుభాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దారు లక్ష్మీ నారాయణ గురువారం గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంటు సుధీర్, వీఆర్వో రంతుల్లా, సిబ్బంది పాల్గొన్నారు.

ఉలవపాడు : జాతీయ క్రీడా దినోత్సవం, తెలుగు మాతృభాషా దినోత్సవాలను మండలంలోని పలు పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో గురువారం ఘనంగా జరుపుకున్నారు. రామాయపట్నం హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెడ్‌మాస్టర్, పీడీ జీవన్‌కుమార్ క్రీడల ప్రాముఖ్యతను వివరించారు. గిడుగు రామమూర్తి తెలుగు భాషకు చేకూర్చిన ప్రాధాన్యతను స్మరించుకుంటూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఉలవపాడు ప్రభుత్వ జూనియర్, ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, కరేడు, చాకిచర్ల, వీరేపల్లి ప్రాథమిక ఉన్నత పాఠశాలల్లో వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.


అల్లూరు : గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తహసీల్దారు లక్ష్మీనారాయణ

కలిగిరి : స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో గురువారం తెలుగుభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు తెలుగుదనం ఉట్టిపడేలా వస్త్రధారణ చేశారు. జిర్రావారిపాలెం విద్యార్థులు ప్రదర్శించిన కోలాటం అలరించింది. పాఠశాలలో వక్తృత్వ, పద్య పఠన, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థినులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.

సంగం : స్థానిక తహసీల్దారు కార్యాలయంలో తెలుగుభాష పితామహుడు గిడుగు రామూర్తి చిత్రపటానికి తహసీల్దారు సోమ్లా నాయక్ పూలమాల వేసి నివాళులర్పించారు. సంగం, తరుణవాయి దువ్వూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఈ కార్యక్రమం చేపట్టారు. విద్యార్థులు తెలుగుతల్లి, తెలుగు కవుల వేషధారణలతో అలరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బుజ్జయ్య, శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: మండలం, మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో గురువారం గిడుగు రామ్మూర్తి జయంతిని ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వాణీశ్రీ, మండల కార్యాలయంలో ఎంపీడీవో ఐజాక్‌ప్రవీణ్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో పంచాయతీరాజ్‌శాఖ ఏఈ షేక్ ఖాదర్‌బాష, కార్యదర్శులు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఉదయగిరి రూరల్: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి తహసీల్దారు ఎం.సుభద్ర పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ నందానీ, సర్వేయరు రవి, వీఆర్వోలు పాల్గొన్నారు. కాగా దుత్తలూరు తహసీల్దారు కార్యాలయంలో గిడుగు చిత్రపటానికి తహసీల్దారు నాగరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి వెంకటసుబ్బారెడ్డి, సీనియర్ అసిస్టెంట్ గులాం, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఏఎస్ పేట: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాసులు ఆధ్వర్యంలో సిబ్బంది సందర్భంగా గిడుగు రామమూర్తి చిత్రటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంఈవో సాయి ప్రసాద్, హెడ్స్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

అనంతసాగరం: వెంగంపల్లి ఉన్నత పాఠశాలలో తెలుగు సేవాసమితి సభ్యులు విద్యార్థులకు ప్రతిభ పరీక్షలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు సుబ్బరాయుడు, సభ్యులు గోవిందరెడ్డి, వెంకటరెడ్డి, సుబ్రమణ్యం పాల్గొన్నారు. అలాగే చిలకలమర్రి ఉన్నత పాఠశాలలో ఈ వేడుకలు నిర్వహించారు.


ఉలవపాడు : ధ్యాన్‌చంద్, గిడుగు రామ్మూర్తి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు


ఆత్మకూరు: ఎంపీడీవో కార్యాలయంలో నివాళులర్పిస్తున్న అధికారులు, సిబ్బంది


సంగం: పూలమాల వేస్తున్న తహసీల్దారు సోమ్లానాయక్


దుత్తలూరు తహసీల్దారు కార్యాలయంలో నివాళులర్పిస్తున్న తహసీల్దారు, ఉద్యోగులు



అనంతసాగరంలో మాట్లాడుతున్న సుబ్బరాయుడు, వింజమూరు: వివిధ వేషధారణల్లో విద్యార్థులు

మర్రిపాడు: మండల కేంద్రంలోని కేజీబీవీ విద్యాలయంలో గ్రంథాలయం ఆధ్వర్యంలో తెలుగుభాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు తెలుగు పద్యాలపై పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి లక్ష్మీదేవి, గ్రంథాలయాధికారి నారాయణరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వింజమూరు: చాకలకొండ రాధాకృష్ణ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు భాష, క్రీడా దినోత్సవాలు ప్రధానోపాధ్యాయులు పోలుబోయిన రమేష్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించడం జరిగింది. ముందుగా గిడుగు రామ్మూర్తి, ధ్యాన్ చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయులు ఏ.సుభాషిణి, షేక్.షమీల బేగం, వ్యాయామ ఉపాధ్యాయులు వెలుగోటి కృష్ణ, ఉపాధ్యాయులు ఏ.సుభాషిణి, సీతామహాలక్ష్మి, శ్రీరాములు, సురరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కావలిటౌన్, ఆగస్టు29: జాతీయ క్రీడా దినోత్సవాన్ని గురువారం విశ్వోదయ పాఠశాల, సంయుక్త సేవాసంస్థ సహకారంతో బాపూజీనగర్‌లోని బీసీ బాలికల పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీడా పోటీలు నిర్వహించి, విజేతలకు పారిశ్రామికవేత్త జయచంద్రనాయుడు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని లక్ష్మీమాధవి, పీఈటీ రాజ్యలక్ష్మి, రెడ్‌క్రాస్ జిల్లా బాధ్యులు గంధం ప్రసన్న, విశ్రాంత బ్యాంక్ మేనేజర్ చంద్రశేఖర్, బుర్లా రఘుకుమార్ రెడ్డి, సంస్థ అధ్యక్షుడు సురేంద్ర పాల్గొన్నారు. అలాగే వెంగళరావునగర్‌లోని మున్సిపల్ పాఠశాలలో ఎన్‌సీసీ ఆధ్వర్యంలో రన్ ఫర్ ఫిట్‌ను నిర్వహించారు. ఎన్‌సీసీ ఆఫీసర్ కొండారెడ్డి పర్యవేక్షణలో జరిగిన రన్‌ను హెచ్‌ఎం హయ్యుల్ హయ్యామ్ జెండా ఊపి ప్రారంభించారు.

ఉదయగిరి రూరల్ : స్థానిక మేకపాటి గౌతంరెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలో ప్రముఖ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని నాలుగు రోజులుగా వాలీబాల్, టెన్నీస్ బాల్, చెస్, బాస్కెట్‌బాల్ తదితర ఆటల పోటీలు నిర్వహించారు. గురువారం పోటీలోని విజేతలకు ఇన్‌చార్జి అసోసియేట్ డీన్ డాక్టర్ కేఎస్ఆర్ పాల్ బహుమతులతోపాటు ప్రశంసా పత్రాలను అందజేశారు. అనంతరం ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ రమేష్, పీడీ రమణ, ప్రొఫెసర్లు సునీత, కిషన్‌తేజ, అశోక్, మాధవి, శోభ, సూర్య పాల్గొన్నారు.

సంగం: స్థానిక జడ్పీహెచ్‌ఎస్‌లో ఎన్‌సీసీ విద్యార్థుల ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. పాఠశాల నుంచి సంగం బస్టాండ్ వరకు ర్యాలీని కొన సాగించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ మాస్టర్ లక్ష్మీనారాయణ, పీడీ అంజయ్య, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.


కావలిలో కబడ్డీ ఆడుతున్న బాలికలు

సీతారామపురం: సంగసానిపల్లె ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు పేరాల శ్రీనివాసులు గిడుగు రామ మూర్తి, జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు ఎంఈవో మస్తాన్‌వలి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ వరలక్ష్మితో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామనికి చెందిన వెంగళశెట్టి బాబురావు పాఠశాలకు ప్రొజెక్టర్, సీపీయూను బహూకరించారు. గిడుగు రామమూర్తి జీవిత చరిత్రను ప్రొజెక్టర్ ద్వారా విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మౌలాలి, పాఠశాల కమిటీ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : స్థానిక డాక్టర్ ఎస్ఆర్‌జె డిగ్రీ కళాశాలలో హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ జయంతిని పురష్కరించుకుని గురువారం పీడీ సిరిమావిళ్ల వెంకటేశ్వర్లు ఆయన జీవిత చరిత్రను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో మాజీ ప్రిన్సిపాల్, లైబ్రేరియన్ డాక్టర్ శ్రీనివాసులురెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు అనంతలక్ష్మీ ఆధ్వర్యంలో క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం గిడుగు రామ్మూర్తిపంతులు జయంతిని జరిపారు. కార్యక్రమంలో ఆత్మకూరు డిప్యూటీ డీఈవో గోపాల్ ముఖ్యఅతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులు అంద జేశారు. కార్యక్రమంలో తెలుగు పండితులు మధుసూధనశాస్త్రి, డాక్టర్ ఎం.పెంచలప్రసాద్, వ్యాయామ ఉపాధ్యాయుడు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

77మందికి ఉద్యోగాలు

కందుకూరు, ఆగస్టు 29: బెంగళూరు ఆల్‌సెక్, పీఎన్‌కే కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలు బుధ, గురువారాలలో ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 77 మందికి ఉద్యోగాలు దక్కాయని టెక్నికల్ డైరెక్టర్ కంచర్ల విజయ్‌శ్రీనివాస్ ప్రకటనలో తెలిపారు.

పర్యావరణాన్ని కాపాడుదాం: ఎమ్మెల్యే కావ్య

కావలి, ఆగస్టు 29: ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. రుద్రకోటలోని ప్రాంతీయ రవాణాశాఖ కార్యాలయ ఆవరణలో గురువారం మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఎక్కువ ఆక్సిజన్ అందించే రాగి, వేప, మారేడు, నేరేడు మొక్కలు నాటాలని కోరారు. నియోజకవర్గ ప్రజలు తనకు 30,948ఓట్ల మెజార్టీ ఇచ్చారని, అదే సంఖ్యలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. ప్రాంతీయ రవాణాశాఖ అధికారి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ వాహనదారుల నిబంధనలను వివరించారు. ఎంవీఐ సుందరరావు, ఏఎంవీఐ కరుణాకర్ పాల్గొన్నారు.

బిట్రగుంట, (దగదర్తి) : కావలి నియోజకవర్గానికి దామవరం ఎయిర్‌పోర్టు మణిహారమని ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి అన్నారు. దగదర్తి మండలం ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో గురువారం టీడీపీ నేతలు, కార్యకర్తలతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలోని ప్రతి చెరువుకు నీరందించేలా చర్యలు చేపడతానని అన్నారు. దగదర్తి-బుచ్చి రోడ్డుకు త్వరలో శంకుస్థాపన చేస్తామన్నారు. కార్యక్రమంలో సోమశిల ప్రాజెక్టు మాజీ చైర్మన్ కండ్లగుంట మధుబాబు, ఇద్రీస్, శ్రీహరినాయుడు, మన్నవ రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.


రవాణాశాఖ కార్యాలయంలో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి, అధికారులు

మర్రిపాడులో శ్రీవారి శాంతి కల్యాణం

మర్రిపాడు : చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయ్యాక వెంకటేశ్వరస్వామి శాంతి కల్యాణం నిర్వహిస్తామని మాజీ ఎమ్మెల్యే చంద్రశేఖర్‌రెడ్డి, సతీమణి టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ శాంతికుమారి మొక్కుకున్నారు. ఈ మేరకు గురువారం రాత్రి మర్రిపాడులోని వారి స్వగృహంలో శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి కల్యాణంను అంగరంగ వైభవంగా నిర్వహించారు. జిల్లాలోని పలువురు కూటమి నా యకులు, వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కూచిపూడి, భరత నాట్యం వంటి సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.


కల్యాణ మహోత్సవంలో మేకపాటి దంపతులు

వివాదాస్పద స్థలం పరిశీలన

దుత్తలూరు(ఉదయగిరి రూరల్) : కట్టకిందపల్లి ఎస్సీ కాలనీలోని పోరంబోకు భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసిన స్థలాన్ని గురువారం తహసీల్దారు నాగరాజు పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు అడిగి వివరాలు తెలుసుకొన్నారు.

ఉద్యాన కళాశాలకు నిధులు మంజూరు చేయండి

కందుకూరు, ఆగస్టు 29: నియోజక వర్గంలో చినలాటిరిపి వద్ద ఉన్న ఉద్యాన కళాశాల శాశ్వత భవనాల నిర్మాణానికి నిధు లు మంజూరు చేయాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. గురువారం విజయవాడలో మంత్రి కింజరపు అచ్చెన్నాయుడును కలిసి కొన్నేళ్లుగా ఉద్యాన కళాశాల కందుకూరు సమీపంలో అద్దె భవనాల్లో నడుస్తున్నదన్నారు. చినలాటిరిపి వద్ద భూ కేటా యింపులు కూడా జరిగినా నిధులు విడుదల లో జాప్యంతో ఈ పరిస్థితి తలెత్తిందన్నారు. నిధులు మంజూరు చేయాలన్నారు. అనంతరం కార్మికశాఖామంత్రి వాసంశెట్టి సుభాష్‌ను కూడా ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా కలిశారు.

వీఆర్ఏ మృతి

అల్లూరు, ఆగస్టు 29: పురుగు మందుతాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నార్తుఆములూరు వీఆర్ఏ సునీల్‌కుమార్ (29) మృతి చెందాడు. కుటుంబ కలహాలతో తాను చనిపోతున్నానని ఈ నెల 27న వీఆర్ఏ పోలీసులకు సమాచారమిచ్చారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహానికి కుటుంబసభ్యులకు అప్పగించారు. స్వగ్రామం లో అంత్యక్రియలు నిర్వహించారు.

విధుల్లోకి తీసుకోండి

కలిగిరి, ఆగస్టు 29:రావులకొల్లు ఆశా వర్కర్ పందిట విజయమ్మను విధుల్లోకి తీసుకోవాలంటూ ఆశావర్కర్లు గురువారం స్థానిక పీహెచ్‌సీ ఎదుట నిరసన చేపట్టారు. విజయమ్మ విధులు నిర్వహించడంలో అలసత్వం వహిస్తుందంటూ రావులకొల్లులో గ్రామసభ నిర్వహించి, సర్పంచు, కార్యదర్శులు తీర్మానం చేశారు. అనంతరం వైద్యాధికారికి వినతిపత్రం అందించారు.

ఎమ్మార్పీఎస్ నేతలకు సన్మానం

కందుకూరు, ఆగస్టు 29: ఎస్సీ వర్గీకరణ కోసం జరిగిన క్రియాశీలక పోరాటంలో పనిచేసిన పందలపాడు సీనియర్ నాయకులు వర్ల దేవదాసు, కాంతారావులను గ్రామస్థులు, ఎమ్మార్పీఎస్ నాయకులు గురువారం రాత్రి సన్మానించారు. ఉపసర్పంచి వర్ల నరేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గ్రామస్థులు, ఎమ్మార్పీఎస్, మాదిగ ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

శివకృష్ణారెడ్డి సేవలు అభినందనీయం

బిట్రగుంట, ఆగస్టు 29: నెల్లూరు శివకృష్ణారెడ్డి సొంత నిధులతో కొత్తూరు ప్రభుత్వ పాఠశాల ఆవరణంలోని గోతులు పూడ్చివేయించారని, బృందావన, జెండాచెట్టు వీధుల్లో అంతర్గత రోడ్లను మరమ్మతులు చేయించారు. గురువారం ఈయన్ను గ్రామ పెద్దలు అభినందించారు.

జగనన్న కాలనీలో విజిలెన్స్ తనిఖీలు

బిట్రగుంట, ఆగస్టు 29: బోగోలు మండల పరిధిలో నిర్మాణంలో ఉన్న జగనన్న లే అవుట్లలోని గృహాలను జిల్లా విజిలెన్స్ అధికారి వెంకటరెడ్డి గురువారం ఆకస్మిక తనిఖీలు చేశారు. ఇప్పటి వరకు పూర్తి అయిన, వివిధ దశల్లో ఉన్న గృహాల వివరాలను ఇన్‌చార్జి ఏఈ శ్వేతను అడిగి తెలుసుకున్నారు. బోగోలు కాలనీకి సంబంధించిన రికార్డులు పరిశీలించారు.

ఖేలో ఇండియా పోటీలకు విద్యార్థిని

కందుకూరు, ఆగస్టు 29: తిరుపతిలో ఈనెల 31, సెప్టెంబరు 1 తేదీల్లో జరగనున్న ఖేలో ఇండియా రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు పట్టణంలోని బీఆర్ ఆక్స్‌ఫర్డ్ విద్యార్థిని భవ్యశ్రీ ఎంపికైందని తైక్వాండో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి షేక్ అబ్దుల్ సలాం గురువారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా భవ్యశ్రీని విద్యాసంస్థల ఛైర్మన్ ఉన్నం భాస్కరరావు, కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు, డైరెక్టర్లు బాలభాస్కరరావు, నరేంద్రబాబు అభినందించారు.

లేఅవుట్ల పరిశీలన

అల్లూరు, ఆగస్టు 29: మండలంలోని ప్రభుత్వ స్థలాల లేఅవుట్లను విజిలెన్స్ అధికారులు గురువారం పరిశీలించారు. అల్లూరులోని బైలర్స్‌కాలనీ, దయాకర్‌రెడ్డి లేఅవుట్లతోపాటు పలు లేఅవుట్లలో నిర్మించిన గృహాలు, నిర్మాణంలో ఉన్న ఇళ్లను పరిశీలించారు. గోదాముల్లో నిల్వ ఉన్న ఐరన్, సిమెంట్ వివరాలను సేకరించారు. నివేదికను ఉన్నతాధికారులకు అందచేస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు మాధవ్, ఉషా, సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు జోక్యంతోనే : ఎమ్మెల్యే కావ్య

కావలి : జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌ను ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ విధానంలో శుక్రవారం ప్రారంభించనున్నట్లు కావలి ఎమ్మెల్యే వెంకటకృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జోక్యంతో ప్రధాని మంత్రి నరేంద్రమోదీ చేతుల మీదుగా హార్బర్‌ను ప్రారంభించడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు.

పాఠశాల ఆకస్మిక తనిఖీ

చేజర్ల : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం ఆత్మకూరు డివిజన్ డిప్యూటీ డీఈవో గోపాల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులు, టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్‌తో సమావేశమై నిర్వహణకు సం బంధించి సలహాలు ఇచ్చారు.

అర్హులైన ప్రతిఒక్కరికీ టీకా వేయాలి

ఉదయగిరి రూరల్ : అర్హులైన ప్రతిఒక్కరికీ అడల్ట్ బీసీజీ టీకా వేయిం చాలని గండిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆరోగ్య బోధకుడు వెంకటసుబ్బయ్య తెలిపారు. గురువారం మాసాయిపేట, గంగిరెడ్డిపల్లి, ఉదయగిరిలోని టీకాల కార్యక్రమాన్ని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. క్షయవ్యాధి ఆరోగ్య పర్యవేక్షకులు భోగ్యం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఉదయగిరిని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయండి

ఉదయగిరి రూరల్/ కలిగిరి : ఉదయగిరి దుర్గాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను గురువారం విజయవాడలో టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు మర్యాద పూర్వకంగా కలిసి విన్నవించారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

కార్యదర్శులతో ఎంపీడీవో సమావేశం

సంగం : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పింఛన్ల పంపిణీపై గురువారం ఎంపీడీవో గోపీ పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతూ సెప్టెంబరు 1 ఆదివారం రావడంతో ఈ నెల 31వ తేదీనే పింఛన్లు పం పిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశించిదన్నారు. ఆ మేరకు శనివారం ఇంటింటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేయాలని కార్యదర్శులకు సూచించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ అప్పాజీ ఉన్నారు.

ఆత్మకూరు: మండలంలో శనివారం ఉదయం 6 గంటల నుంచే సంబంధిత గ్రామ సచివాలయ సిబ్బంది ఎన్‌టీఆర్ భరోసా పింఛన్లను లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి అందజేస్తారని ఎంపీడీవో ఐజాక్‌ప్రవీణ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

వైద్యశాల నిర్మాణానికి స్థలపరిశీలన

మర్రిపాడు : కృష్ణాపురంలో నూతన వైద్యశాల నిర్మాణానికి 1.50సెంట్ల భూ మిని కేటాయించారు. ఈ భూమిని గురువారం ఆర్డీవో మధులత పరిశీలించి మాట్లాడారు. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం ఈ పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

అనంతసాగరం : సోమశిల పెన్నా పరివాహక ప్రాంతం నుంచి ఇసుక అక్ర మ రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను గుర్తించి సోమశిల పోలీసులు బుధవారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. వాటిని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసులు నమోదు చేస్తామన్నారు.

గీతాశ్రమంలో హనుమాన్‌చాలీసా పఠనం

అల్లూరు : కృష్ణాష్టమిని పురస్కరించుకొని స్థానిక గీతాశ్రమంలో గురువారం హనుమాన్ చాలీసా పఠనం చేపట్టారు. ఖమ్మంకు చెందిన కళాకారులు గురువారం ఉద యం నుంచి శుక్రవారం ఉదయం వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని నిర్వాహకులు అనంతరాజు బాలకృష్ణంరాజు తెలిపారు. కార్యక్రమంలో యరటపల్లి శేఖర్‌రెడ్డి, మోమిడి మాధవరావు, పప్పు సుధాకర్, సురేష్, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

జలదంకిలో బీజేపీ సమావేశం

జలదంకి : స్థానిక పద్మావతి కల్యాణ మండపంలో గురువారం బీజేపీ మండల అధ్యక్షుడు కంచర్ల శరత్‌బాబు అధ్యక్షతన మండల కార్యవర్గ సమావేశం జరిగింది. మండల ఇన్‌చార్జ్ పూనూరు మాధవరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జిల్లా కార్యదర్శి మారెళ్ళ బహ్మారెడ్డి తదితరులు మాట్లాడారు. ఈ సమావేశంలో జలదంకి ఎంపీటీసీ కే మాధవరావుయాదవ్, నాయకులు వడ్డే శ్రీనాథ్‌రెడ్డి, బండారు తిరుపతిరెడ్డి, వీ రాకేష్‌రెడ్డి, కిషోర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



తోటపల్లిగూడూరు : తహసీల్దారు కార్యాలయంలో గిడుగు రామమూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిబ్బంది



బుచ్చిరెడ్డిపాళెం : బెజవాడ బుజ్జమ్మ బాలికల పాఠశాలలో మాతృభాషా దినోత్సవంలో కవుల వేషధారణలో బాలబాలికలు

తోటపల్లిగూడూరు, ఆగస్టు 29: మండల రెవెన్యూ కార్యాలయంలో గురువారం తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా తెలుగు భాషా పితామహుడు గిడుగు వెంకటరామమూర్తి చిత్రపటానికి తహసీల్దారు పద్మజ పూలమాల వేసి నివాళులర్పించారు. డిప్యూటీ తహసీల్దారు శివయ్య, సిబ్బంది పాల్గొన్నారు. మండలంలోని చెన్నపల్లిపాలెం ప్రాథమికోన్నత పాఠశాల, రావూరివారి కండ్రిగ ప్రాథమిక పాఠశాలలో తెలుగు భాష దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

●**బుచ్చిరెడ్డిపాళెం:** పెద్దూరులోని బెజవాడ బుజ్జమ్మ జడ్పీ బాలికోన్నత పాఠశాలలో గురువారం మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా బాలబాలికల కవుల వేషధారణలు అలరించాయి. అదేవిధంగా ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కాగా, రామచంద్రాపురం ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు, సాహితీవేత్త గండికోట సుధీర్‌కుమార్‌కు విజయవాడలో 'గిడుగు సాహితీసేవ' పురస్కారం అందజేశారు.

●**ముత్తుకూరు** : బలిజపాలెం ప్రాథమిక పాఠశాలలో గురువారం తెలుగుభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థు లకు పద్యాల పోటీ నిర్వహించి విజేతలకు మండల విద్యాశాఖ అధికారులు మధుసూదన్, హేమసుందర్ బహుమతులు అందజేశారు. ఈ కార్య క్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులురెడ్డి, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ దేవిక, ప్రధానోపా ధ్యా యులు, ఉపాధ్యాయులు తది తరులు పాల్గొ న్నారు.

●**కోవూరు:** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం తెలుగుభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. తెలుగు భాషకు గిడుగు రామమూర్తి చేసిన సేవలను ప్రిన్సిపాల్ ఎస్‌ఏ సికందర్ విద్యార్థులకు వివరించారు. పద్యాల పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు.

●**ఇందుకూరుపేట:** పల్లిపాడు ప్రభుత్వ డైట్ కళాశాలలో గురువారం తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్స వం నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పి రమేష్ తెలిపారు. ముందుగా గిడుగు రామ్మూర్తి, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించా రు. ఈ సందర్భంగా వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో బోధనేతర సిబ్బంది, ఛాత్రోపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

●**వెంకటాచలం:** స్థానిక విక్రమ సింహపురి యూనివర్సిటీలో గురువారం క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వీఎస్‌యూ వీసీ డాక్టర్ సారంగం విజయభాస్కర్‌రావు, వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, వర్సిటీ ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, డాక్టర్ నరసింహారెడ్డి, డాక్టర్ శివకుమార్, డాక్టర్ ఎం త్యాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఐకి సన్మానం

మనుబోలు, ఆగస్టు 29: స్థానిక ఎస్‌ఐ ఎంఎస్ రాకేష్‌ను గురువారం మండల టీడీపీ, బీజేపీ నాయకులు కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు పొన్నూరు రామకృష్ణయ్య, గాలి రామకృష్ణారెడ్డి, మధునాయుడు, నాయకులు సూరిశెట్టి నాగేశ్వరరావు, కృష్ణయ్య నాయుడు, సునీల్ నాయుడు పాల్గొన్నారు.

● **ముత్తుకూరు** : స్థానిక ఎస్‌ఐగా విశ్వనాథరెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన్ని టీడీపీ నాయకులు మల్లికార్జున్‌యాదవ్, షఫీ వుల్లా, శ్రీనివాసులు కలిసి అభినందనలు తెలియజేశారు.

● **నెల్లూరు(క్రైం)** : నెల్లూరు నగర నార్త్, సౌత్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లుగా కే రామకృష్ణ, కే వెంకటరెడ్డి గురువారం బాధ్యతలు స్వీరించారు.

బీజేపి ప్రధాన కార్యదర్శిగా వలిపి

మనుబోలు, ఆగస్టు 29: మండల బీజేపీ ప్రధాన కార్యదర్శిగా వలిపి శ్రీనువాసులును నియమిస్తున్నట్లు బీజేపీ నాయకులు గురువారం ప్రకటించారు. వలిపికి పార్టీ కండువా వేసి జిల్లా కార్యవర్గసభ్యులు వాసిరెడ్డి రామిరెడ్డి ఆహ్వానించారు. ఈకార్యక్రమంలో బీజేపీ నాయకులు బోలా శ్రీనువాసులు, ఆరుమూళ్ల మురళి, పల్లిబోయిన రాజశేఖర్, గోపిరెడ్డి, మస్తాన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వనమహోత్సవానికి నామమాత్రపు ఏర్పాట్లు

కోవూరు, ఆగస్టు 29: ప్రభుత్వం నియోజకవర్గ కేంద్రాల్లో శుక్రవారం వనమహోత్సవం కార్యక్రమాన్ని ఉత్సవంగా నిర్వహించమని అధికారుల్ని ఆదేశించింది. కానీ ఈ కార్యక్రమం గురించి పంచాయతీ, మండల పరిషత్ సిబ్బంది పట్టించుకోక పోవడంతో జిల్లా స్థాయి అటవీ శాఖాధికారులు శివరామకృష్ణారెడ్డి, ఇంద్రసేనారెడ్డి తమ సొంత కూలీలతో గుంతల్ని తవ్వించారు. కార్యక్రమ ఏర్పాట్ల గురించి ఇతర శాఖాధికారులు పట్టించు కోక పోవడంతో అటవీశాఖాధికారులు ఇబ్బందులకు గురయ్యారు.

పశువు కనిపిస్తే పట్టుకెళ్లిపోతాం..!

నెల్లూరు(సిటీ) : నెల్లూరులో ప్రధాన రోడ్లపై ప్రయాణికులకు తీవ్ర ఆటకంగా మారిన పశువులను నిలువరించే చర్యలకు ఎట్టకేలకు కార్పొరేషన్ అధికారులు ఉపక్రమించారు. కొన్ని రోజులుగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్న సిబ్బంది రోడ్లపై కనిపించిన పశువులను గోశాలకు తరలిస్తున్నారు. ఎన్‌ఎంసీకి చెందిన పశువైద్యుడు మదన్‌మోహన్ నేతృత్వంలోని ప్రత్యేక బృందాలు వాహనాల్లో కల్లూరుపల్లిలోని గోశాలకు తరలిస్తున్నారు. ఇదేవిధంగా గురువారం నగరంలోని పలు ప్రాంతాలలో రోడ్లపై ఉన్న పశువులను గోశాలకు తరలించారు.

అంగన్‌వాడీలను ఆరోగ్య నిలయాలుగా తీర్చిదిద్దండి



కోడిగుడ్లను పరిశీలిస్తున్న సీతారాం

వెంకటాచలం, ఆగస్టు 29: అంగన్‌వాడీ కేంద్రాలను ఆరోగ్య నిలయాలుగా తీర్చి దిద్దేందుకు అధికారులు, సిబ్బంది కృషి చేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం అన్నారు. గొలగమూడిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన గురువారం అధికారులతో కలిసి తనిఖీ చేశారు. ఈసందర్భంగా రిజిస్టర్లు పరిశీలించారు. అనంతరం పిల్లలకు, గర్భిణులు, బాలింతలకు అందుతున్న పౌష్టికాహారంపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి విజయలక్ష్మి, అంగన్‌వాడీ సూపర్వైజర్ పద్మజ, సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ మస్తాన్‌బాబు, గీత తదితరులున్నారు.

ఎట్టకేలకు వైఎస్ ఫొటో తొలగింపు

మనుబోలు : అక్కంపేటలో వాటర్‌ప్లాంట్ వివాదానికి కారణమైన వైఎస్ ఫొ టోను గురువారం పంచాయతీ అధికారులు తొలగించారు. వై ఎస్ ఫోటో ఉన్న ఫ్లెక్సీని తొలగించాలని గ్రామస్థులు కోరడం తో గురువారం ఈవోఆర్‌డి జీవి ఎస్‌వి ప్రసాద్, ఇన్‌చార్జి పం చాయతీ కార్యదర్శి రాజేశ్వరి వెళ్లారు. అక్కడ సర్పంచు జాంబవతమ్మ అధికారులను ఫ్లెక్సీ తీసేందుకు వీలులేదని అడ్డుచెప్పారు. దీంతో ఎలాంటి ఫోటోలు లేకుండా కేవలం పేర్లు మాత్రం ఉండే ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. గ్రామంలో పోలీస్ పికెట్ కొనసాగుతోంది.

చికిత్స పొందుతూ రైతు మృతి

మనుబోలు : అప్పుల బాధ తట్టుకోలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మండలంలోని పిడూరుపాళెం గ్రామానికి చెందిన పోతల నరేంద్రరెడ్డి (49) అనే రైతు బుధవారం అర్ధరాత్రి చికిత్స పొందుతూ మృతిచెందాడు. నరేంద్రరెడ్డి వ్యవసాయం కోసం అప్పులు చేశాడు. వాటిని తీర్చలేక, అప్పులోళ్ళ బాధ తట్టుకోలేక మనస్తాపంతో బుధవారం వేకువజామున ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు గుర్తించి చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ చనిపోయాడని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పక్కా ప్రణాళికతో వాయు కాలుష్య నియంత్రణ

● **వైజాగ్‌లో జరిగిన ఎన్‌క్యాప్ సదస్సులో కమిషనర్ సూర్యతేజ**

నెల్లూరు(సిటీ) : నెల్లూరులో ప్రజలు వాయు కాలుష్యానికి గురి కాకుండా పక్కా ప్రణాళికలను అనుసరిస్తున్నామని కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ వెల్లడించారు. విశాఖలో గురువారం జరిగిన నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాంలో ఆయన పాల్గొన్నారు. నెల్లూరులో అనుసరిస్తున్న విధి, విధానాలను పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ నగరంలో 2019 వరకు వాయు కాలుష్య ప్రమాణాలు ప్రమాదకరంగా ఉండగా అక్కడి నుంచి వాటిని తగ్గించుకుంటూ వస్తున్నామన్నారు. ఇందుకు మొక్కలు పెంచడం, రోడ్ల పై గుంతలు పూడ్చడం, చెత్తను కాల్చడం పూర్తిగా నియంత్రించడం వంటివి పక్కాగా అమలు చేస్తున్నామని వివరించారు. క్లీన్ అండ్ గ్రీన్ కింద రూ. 8 కోట్లు కార్పొరేషన్‌కు కేటాయించగా వాటిని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకున్నట్లు తెలిపారు. నెల్లూరులో 286 గుంతలు పూడ్చడం వల్ల చాలా వరకు దుమ్ము సమస్య తీరిందని, భవనాలు కూల్చివేతల్లోనూ దుమ్ము రాహిత్యాన్ని అనుసరిస్తున్నామని చెప్పారు.

విలువలతో కూడిన విద్యను అందించాలి



విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న షేక్ ఖాజామొహిద్దీన్

పొదలకూరు, ఆగస్టు 29: విలువలతో కూడిన విద్యను విద్యార్థులకు అందించాలని జిల్లా ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి షేక్ ఖాజామొహిద్దీన్ ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం పట్టణంలోని ఉర్దూ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థుల సామర్థ్యాలు, పాఠశాల రికార్డులను పరిశీలించారు. ఉపాధ్యాయులు సాంకేతిక విద్యపై పట్టు సాధించాలన్నారు. అనంతరం పాఠశాలలో ఇస్తున్న రాగి జావ రుచిచూసి సంతృప్తి వ్యక్తంచేశారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయుడు ఎస్‌డీ అబ్దుల్‌ఖాదర్, తదితరులు పాల్గొన్నారు.

మనస్తాపంతో టీడీపీ కార్యకర్త ఆత్మహత్యాయత్నం

విడవలూరు, ఆగస్టు 29: మండలంలోని ముదివర్తి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త నన్నం దినేష్ గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడడం కలకలం రేపింది. కుటుంబ సభ్యుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గ్రామంలోని ఒక దేవాలయ అభివృద్ధికి కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కొంత నగదును విరాళంగా అందజేశారు. అయితే ఆ నగదును ఒక వ్యక్తి తన సొంతానికి వాడుకున్నాడని ఆరోపణలున్నాయి. ఈక్రమంలో నన్నం దినేష్ సదరు వ్యక్తిని దేవాలయానికి విరాళంగా అందజేసిన నగదు ఏమైందని నిలదీయడంతో గ్రామానికి చెందిన కొందరు దినేష్‌పై దాడిచేసి దుర్భాషలాడారు. దీంతో మనస్తాపానికి గురైన దినేష్ పురుగుల మందు తాగడంతో గమనించిన స్థానికులు నెల్లూరు జీజీహెచ్‌కు తరలించారు. ఈమేరకు పోలీసులకు సమాచారం అందడంతో విచారణ చేపట్టారు.

ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ఆర్థిక సాయం

ముదివర్తి గ్రామానికి చెందిన నన్నం దినేష్ ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన విషయం తెలుసుకున్న కోవూరు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అతని యోగక్షేమాలను మండల నాయకులను అడిగి తెలుసుకున్నారు. అతనికి రూ.20వేలు ఆర్థిక సాయాన్ని విడవలూరు మండల ఇన్‌చార్జ్ అడపాల శ్రీధర్‌రెడ్డి చేతుల మీదుగా బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

ప్రభుత్వ పాఠశాలలో కుళాయిలు, పైపుల చోరీ

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 29: స్థానిక బాలకృష్ణా గిరిజన కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో గుర్తుతెలియని వ్యక్తులు బుధవారం రాత్రి కుళాయిలు, పైపులు, పలు శానిటరీ వస్తువులు చోరీ చేశారు. చేతులు కడిగే పలు కుళాయిలు, వాష్‌బేషిన్ కుళాయిలు, ఊడదీసుకుని వెళ్లారు.

ఎరువుల యాజమాన్యంపై రైతులకు అవగాహన

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 29: మండలంలోని రేబాలలో రైతులకు ఆత్మవారి సౌజన్యంతో గురువారం రైతు సేవా కేంద్రంలో ఎరువుల యాజమాన్యంపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. యాజమాన్య పద్ధతులను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త కిరణ్‌కుమార్‌రెడ్డి, నెల్లూరు వ్యవసాయ అధికారిణి గీతాకుమారి, ఇఫ్‌కో జిల్లా అధికారి లక్ష్మీనారాయణ, మండల వ్యవసాయాధికారి ఎం.సురేంద్రరెడ్డి, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

కొడవలూరు, ఆగస్టు 29: మండలంలో నార్తు రాజుపాళెం గ్రామంలో మహలక్ష్మమ్మ ఉత్సవాన్ని పురస్కరించుకుని గురువారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

నెల్లూరు సిటీ, రూరల్
కోవూరు, సర్వేపల్లి



పొట్టేపాళెం జడ్పీ పాఠశాలలో...



కేఏసీ కళాశాలలో గిడుగు రామ్మూర్తికి నివాళి

తెలుగు భాష అమ్మ వంటిది

● విద్యాసంస్థల్లో ఘనంగా భాషా దినోత్సవం

నెల్లూరు (విద్య), ఆగస్టు 29 : తియ్యనైన తెలుగు భాష అందరికీ అమ్మ వంటిదని పలువురు వక్తలు తెలిపారు. తెలుగు భాషోద్యమ పితామహుడు గిడుగు వెంకట రామ్మూర్తి జయంతి సందర్భంగా నగరంలోని వివిధ విద్యాసంస్థల్లో గురువారం తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

● డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ డీ గిరి మాట్లాడు తూ మన పలుకుబడులు, పద్యాలు తెలుగుభాషలోని మాధుర్యాన్ని తెలియచేస్తాయన్నారు. తెలుగుభాషలోని సౌందర్యం మరే ఇతర భాషల్లో లేదన్నారు. మాతృభాషలో విద్యనభ్యసించి ఎంతో మంది ఉన్నత శిఖరాలు అధిరోహించారన్నారు. గ్రాంథిక భాషలో ఉన్న తెలుగును గిడుగు రామ్మూర్తి వ్యవహారిక భాషా ఉద్యమం ద్వారా సరళతరం చేసి తెలుగు ప్రజలకు అందించారని చెప్పారు. నేటితరం విద్యార్థులందరూ తెలుగును పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. అనం తరం విద్యార్థినులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకు న్నాయి. వివిధ రకాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్ర హ్మణ్యం, పరవస్తు నాగసాయి సూరి, డాక్టర్ కాళిదాసు పురుషోత్తం, డాక్టర్ పెరుగు రామకృష్ణ, డాక్టర్ టేకుమళ్ల వెంకటప్పయ్య, డాక్టర్ పీఎంవీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

● సరస్వతినగర్‌లోని డాక్టర్ కిషోర్స్ రత్నం పాఠశాలలో విద్యార్థులు తెలుగు సంస్కృ తీ, సంప్రదాయాలు ఉట్టిపడేలా వస్త్రధారణతో చేసిన కార్యక్రమాలు ఆకట్టుకు న్నాయి. తెలుగు సాహిత్యాన్ని, గొప్పతనాన్ని తెలియచేసిన శ్రీకృష్ణదేవరాయులు, అష్టదిగ్గజ కవులతో కూడిన భువనవిజయం నాటిక, సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రముఖ కవులైన నన్నయ, తిక్కన, ఎర్రన, పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమయ్య, గిడుగు రామ్మూర్తి వేషధారణలో అలరించారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు, మేనేజర్ అజయ్‌సింగ్, ఏవో సునీల్, ప్రిన్సిపాళ్లు మణిమాల, ప్రహర్ష, సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

● పొట్టేపాళెంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం తెలుగుభాషా దినోత్సవం, జాతీయ క్రీడాదినోత్సవం నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరిం చాయి. ఈ సందర్భంగా ఉపాధ్యాయురాలు ప్రసన్నలక్ష్మి పాఠశాలకు పీవీసీ మ్యాట్‌లను అందచేశారు. అనంతరం తెలుగు వ్యాసరచన, వక్తృత్వ పోటీల విజేతలకు, వివిధ క్రీడాంశాల్లో గెలిచిన విద్యార్థులకు బహుమతులు అందచేశారు. హెచ్‌ఎం వినయ్‌కు మార్, పీడీ హుస్నారా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఉన్న సమగ్రశిక్ష విభాగంలో తెలుగుభాషా దినోత్సవం, జాతీయ క్రీడాది నోత్సవాన్ని జరుపుకున్నారు. గిడుగు రామ్మూర్తి, మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏపీసీ ఉషారాణి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

● స్టోన్‌హౌస్‌పేటలోని కేఏసీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలుగుభాషా దినోత్సవం, జాతీయ క్రీడాది నోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాసులు రెడ్డి తెలుగుభాష గొప్పతనం, విశిష్టతను వివరించారు. అధ్యాపకులు పులి చెంచయ్య, ఏ సుధీర్, కే శ్రీనివాసులు, ఎన్‌ఎస్‌ఎస్ సిబ్బంది మునిరాజా, రవికృష్ణ పాల్గొన్నారు.

● కొండాయపాళెం నగరపాలక ప్రాథమిక పాఠశాలలో తెలుగుభాషా దినోత్సవం నిర్వహించారు. హెచ్‌ఎం భాస్కర్‌రావు విద్యార్థులకు పద్యాల పోటీలు నిర్వహించి విజేత లకు బహుమతులు అందచేశారు.

● సంఘమిత్ర పాఠశాలలో తెలుగుభాష గొప్పతనం గురించి విద్యార్థులకు తెలియ చేశారు. పాటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేశారు. హెచ్‌ఎం సుచిత్ర, జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు జయప్రకాష్, కోశాధికారి నజీమా, ఉపాధ్యాయురాలు పాల్గొన్నారు.

● బీవీనగర్ కేఎన్‌ఆర్ నగరపాలక ఉన్నత పాఠశాలలో గిడుగు రామ్మూర్తి జయంతి వేడుకలు నిర్వహించారు. తెలుగు ఉపాధ్యాయుడు నరేంద్రబాబు మాట్లాడుతూ చిన్నతనం నుంచే తెలుగుభాషను ప్రేమించాలని సూచించారు.

● జీవీఆర్‌ఆర్ జూనియర్ కళాశాల, జనహిత వాత్సల్య సంయుక్త ఆధ్వర్యంలో కళాశాలలో గురువారం తెలుగుభాషా దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ దోర్నాదుల వెంకటేశ్వర్లు గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాతృభా షను గౌరవిస్తే ఉన్నతంగా ఎదుగుతారని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సతీష్, జాకీర్, జ్యోతి, ప్రియ, సుకన్య, సిబ్బంది పాల్గొన్నారు.

కాళీయమర్దనుడిగా వేణుగోపాలుడు

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 29 : నగరంలోని మూలాపేట రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో శ్రీకృష్ణ అవతార ఉత్సవాలు ఘనంగా జరుగుతు న్నాయి. గురువారం ఉదయం అభిషేకాలు, విశేష పూజలు జరిగాయి. సాయంత్రం మూలవరులకు విశేష పూలంగిసేవ జరిగింది. అనంతరం స్వామివారు కాళీయమర్దనుడి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ప్రాకారోత్సవం అనంతరం ఊంజల్ సేవ జరిగింది. అమ్మిశెట్టి వెంకటరమేష్, శ్రీనివాసకుమారి ఉభయకర్తలుగా వ్యవహరించారు.

ప్రభుత్వ వైద్య కళాశాలకు పీజీ సీట్లు ఇవ్వండి

● మెడికల్ కమిషన చైర్మన్‌కు ఎంపీ వేమిరెడ్డి వినతి

నెల్లూరు(హరనాథ పురం), ఆగస్టు 29 : నెల్లూరులోని ఏసీ సుబ్బా రెడ్డి ప్రభుత్వ వైద్య కళా శాలకు పీజీ సీట్లు కేటా యించాలని నేషనల్ మెడికల్ కమిషన్ చైర్మన్ గంగాధర్‌కు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి వినతి పత్రం ఇచ్చారు. ఢిల్లీలోని కమిషన్ కార్యాలయంలో గురువారం గంగాధర్‌ను వేమిరెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి శ్రీవారి లడ్డు అందచేసి శాలువాతో సత్కరించారు. అలాగే, నీతి ఆయోగ్ సీఈవో బీఆర్ సుబ్ర హ్మణ్యం తోనూ వేమిరెడ్డి భేటీ అయ్యారు. ఆయనకు కూడా శ్రీవారి ప్రసాదం అందచేసి శాలువా తో సత్కరించారు. పలు అంశాలను సుబ్రహ్మణ్యం దృష్టికి తీసుకెళ్లారు.

● **శ్రీశైల మల్లన్న స్వర్ణ రథోత్సవంలో ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి**

శ్రీశైల మల్లికార్జునస్వామి స్వర్ణ రథోత్సవంలో గురువారం ఆ రథ దాత, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పాల్గొన్నారు. ఈ స్వర్ణ రథోత్సవం కనుల పండువగా సాగింది. ప్రశాంతిరెడ్డి తనయుడు అర్జున్‌రెడ్డి, కుటుంబ సభ్యులు హనీష్, ముంగమూ రు చైతన్య, ఆలయ అధికారి పెద్దిరాజు, టీడీపీ నాయకులు దువ్వూరు కల్యాణ్‌రెడ్డి, బెజవాడ వంశీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో యువకుడి బలవన్మరణం

● తట్టుకోలేక తల్లి ఆత్మహత్యాయత్నం



నరేంద్ర (ఫైల్)

నెల్లూరు(క్రైం), ఆగస్టు 29: కష్టపడి చదువుకున్నాడు. తండ్రికి అన్నీ పనుల్లో అండగా నిలిచేవాడు. తండ్రి మూడేళ్ల కిందట మరణించడంతో కుటుంబ బాధ్యతలు తనపై వేసుకున్నాడు. ఈ క్రమంలో అప్పులు చేయాల్సి వచ్చింది. వాటిని ఎలా తీర్చాలో అర్థంకాక మానసికంగా కుంగిపోయాడు. చివరికి చావే పరిష్కారంగా తలచి రైలు కింద తలపెట్టాడు. అల్లారుముద్దుగా పెంచుకున్న కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడన్న విషయం తెలుసుకున్న తల్లి ఘటనా స్థలంలో కుమారుడి మృతదేహాన్ని చూసి తట్టుకోలేక ఆత్మహత్యకు యత్నిం చింది. ఈ ఘటన నెల్లూరు ప్రధాన రైల్వే స్టేషన్‌లో గురువారం చోటుచేసుకుంది. సేకరించిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లాలోని విడవలూరు మండలం గాదెలదిన్నె గ్రామానికి చెందిన లక్కీశెట్టి సరస్వతమ్మ, చలపతి దంపతులకు ఒక కుమారుడు లక్కీశెట్టి నరేంద్ర(30), కుమార్తె ఉన్నారు. మూడేళ్ల కిందట చలపతి అనారోగ్యంతో మృతి చెందడంతో కుటుంబ పోషణ నరేంద్ర చూస్తున్నాడు. గూడూరు పట్టణంలోని ఓ ప్రైవేటు బ్యాంకులో నరేంద్ర పనిచేస్తున్నాడు. అక్కకు వివాహం చేసి తల్లిని ఎంతో సంతోషంగా చూసుకుంటూ ఉన్నాడు. అయితే కుటుంబ బాధ్యతలతో ఆయన అప్పులపాలయ్యాడు. వాటిని తీర్చలేక గురువారం మధ్యాహ్నం నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్‌లో రైలుకిందపడి మృతి చెందాడు. ఆత్మహత్య చేసుకుంటున్న విషయాన్ని అంతకుముందే వాయిస్ మెసేజ్ రూపంలో కుటుంబసభ్యులకు పంపాడు. కుటుంబసభ్యులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని గుండెలు పగిలేలా ఏడ్చారు. తల్లి సరస్వతమ్మ రైలుకింద పడేందుకు యత్నించడంతో తలకు గాయాలయ్యాయి. ఆమె ప్రస్తుతం నారాయణ వైద్యశాలలో చికిత్స పొందుతోంది. రైల్వే పోలీసులు నరేంద్ర మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హెల్త్ ఎమర్జెన్సీని ప్రకటించాలి

● డీఎంహెచ్‌వోకు డీవైఎఫ్‌ఐ, ఐద్వా నేతల వినతి

నెల్లూరు(వైద్యం), ఆగస్టు 29 : నగరంలో హెల్త్ ఎమర్జెన్సీని ప్రకటించాలని డీవైఎఫ్‌ఐ, ఐద్వా నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్యకు వినతిపత్రం అందించారు. ఐద్వా జిల్లా అధ్యక్షురాలు మస్తాన్‌బీ మాట్లాడుతూ నగరంలో నెలరోజులుగా విషజ్వరాలు ప్రబలుతున్నాయన్నారు. ఆ విషజ్వరాలపై ప్రజలకు అవగాహన కలిగించటంలో వైద్యాధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ నేత నరసింహం, మలేరియా నివారణ అధికారి హుస్సేనమ్మ, ఐద్వానేత పద్మజ పాల్గొన్నారు.

క్లీన్ ఆంధ్ర - గ్రీన్ ఆంధ్ర నినాదంతో నేటి నుంచి పవన్ పుట్టినరోజు వేడుకలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఆగస్టు 29: క్లీన్ ఆంధ్ర-గ్రీన్ ఆంధ్ర నినాదంతో జనసేన పార్టీ అధినేత, రాష్ట్ర డిప్యూటీ సీఎం కొణిదల పవన్ కల్యాణ్ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నామని జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ తెలిపారు. నగరంలోని జనసేన పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. జనసైనికులు పర్యావరణ పరిరక్షణ గురించి ప్రజలకు వివరించేలా కార్యక్రమాలు చేపడుతున్నామని, శుక్రవారం నుంచి సెప్టెంబరు 2వ తేదీ వరకు వేడుకలు నిర్వహించాలన్నారు. శుక్రవారం ఉదయం గాంధీ బొమ్మ సెంటర్లో 1000 మొక్కల పంపిణీ, అదే రోజు సాయంత్రం జీజీహెచ్ పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ, ఆదివారం పార్టీ కార్యాలయంలో రక్తదాన శిబిరం జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జమీర్, చంద్రశేఖర్‌రెడ్డి, మురళీకృష్ణ పాల్గొన్నారు.

గంటల్లో నేరస్థుడి అరెస్ట్

నెల్లూరు(క్రైం), ఆగస్టు 29: దొంగతనం జరిగిన గంటల సమయంలో నవాబుపేట పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశార పోలీసుల సమాచారం మేరకు... విడవలూరు మండలం రామతీర్థం గ్రామానికి చెందిన అక్కిరాల అన్వేష ఈ నెల 28వ తేదీ ఉదయం రామతీర్థం నుంచి బయలుదేరి తన అవసరాల నిమిత్తం నాయుడుపేటలో ఉన్న బంధువుల వద్దకు వెళ్లి రూ.లక్ష నగదు అప్పుగా తీసుకున్నాడు. నాయుడుపేట నుంచి బయలుదేరి ఆత్మకూరు బస్టాండుకు చేరుకున్నాడు. రామతీర్థం బస్సు ఎక్కే సమయంలో ఆయన జేబులో ఉన్న రూ.లక్ష నగదును గుర్తుతెలియని దుండగులు దొంగలించారు. ఈ విషయాన్ని గమనించిన అన్వేష్ అనే వ్యక్తి నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇన్‌స్పెక్టర్ అన్వర్‌బాషా క్రైమ్ సిబ్బందిని అప్రమత్తం చేసి సీసీపుటేజ్‌ల సహకారంతో గంటల సమయంలో నిందితుడు షేక్ ఖాజా మస్తాన్‌ను అదుపులోకి తీసుకున్నాడు. నగదును బాధితుడికి అప్పగించారు.

క్రీడారంగానికి ధ్యాన్‌చంద్ ఆదర్శం

● డీఎస్‌డీవో యతిరాజ్
● ఘనంగా జాతీయ క్రీడాదినోత్సవం



అవెన్యూస్ పాఠశాలలో...

నెల్లూరు (విద్య), ఆగస్టు 29 : ప్రపంచంలో క్రీడలకు ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చిన మేజర్ ధ్యాన్‌చంద్ హాకీ క్రీడకే కాకుండా క్రీడారంగానికే ఆదర్శనీయులని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఆర్‌కే యతిరాజ్ తెలిపారు. జాతీయ క్రీడాదినోత్సవం సందర్భంగా నగరంలోని ప్రభుత్వ బీఈడీ కళాశాలలో గురువారం జరిగిన వేడుకల్లో ఆయన అతిథిగా పాల్గొని ప్రసంగించారు. జిల్లాలో క్రీడల ఉన్నతికి అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. వివిధ క్రీడాంశాల్లో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఆయన బహుమతులు అందచేశారు. ఈ సందర్భంగా డీఎస్‌డీవోను కళాశాల సిబ్బంది ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం వేణుగోపాల్, ఫిజికల్ డైరెక్టర్ ఎం రవీంద్రబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

● క్రీడాకారులు అవకాశాలను అందిపుచ్చుకుని పోటీల్లో ఉత్తమంగా రాణించాలని జిల్లా క్రీడాధికారి ఆర్‌కే యతిరాజ్ పిలుపునిచ్చారు. నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో గురువారం జాతీయ క్రీడాదినోత్సవం సందర్భంగా వేడుకలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్టేడియంలో క్రీడాకారులను అన్ని వసతులు అందుబాటులో ఉన్నాయన్నారు. మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వివిధ క్రీడాంశాల్లో రాణించిన క్రీడాకారులు, పతకాలు సాధించిన వారిని సత్కరించి బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో సెట్నెల్ సీఈవో వెంకటయ్య, ఎన్‌వైకే కోఆర్డి నేటర్ మహేంద్రరెడ్డి, జిల్లా ఒలంపిక్ సంఘం అధ్యక్షుడు మహేష్ రెడ్డి, కార్యదర్శి కే గురుప్రసాద్, కోచ్‌లు, క్రీడాకారులు, సిబ్బంది పాల్గొన్నారు.

● నెహ్రూయువ కేంద్రం ఆధ్వర్యంలో ప్రగతి విద్యాలయంలో జాతీయ క్రీడాదినోత్సవాన్ని నిర్వహించారు. యువజన అధికారి మహేంద్రరెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

● అవెన్యూస్ పాఠశాలలో తెలుగుభాషా దినోత్సవం, జాతీయ క్రీడాదినోత్సవం నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి, మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు అతిథులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగుభాష వైభవాన్ని, క్రీడారంగం ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియచేశారు. వివిధ క్రీడల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందచేశారు. బుచ్చి సీఐ శ్రీనివాసరెడ్డి, తెలుగుభాషాభిమాని పేరిచెట్ల శివకుమార్, కరస్పాండెంట్ కృష్ణచైతన్య, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్వేతసంధ్య, వైస్‌ప్రిన్సిపాల్ సురేష్, పీఈటీ రాజు పాల్గొన్నారు.

● 10వ ఆంధ్ర నేవల్ యూనిట్ ఎన్‌సీసీ ఆధ్వర్యంలో నగరంలో రన్ ఫర్ ఫిట్నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్‌సీసీ కేడెట్స్ బీవీనగర్ కేఎన్‌ఆర్ పాఠశాల నుంచి ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం వరకు పరుగులో పాల్గొన్నారు. స్టేడియంలో జరిగిన క్రీడాదినోత్సవ వేడుకల్లో భాగస్వాములయ్యారు. ఎన్‌సీసీ ఆఫీసర్లు గుండాల నరేంద్రబాబు, సీవీ నాగరాజు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి

5 

తిరుపతి
జిల్లా వార్తలు

శుక్రవారం 30 ఆగస్టు 2024

నేడు ఆవిష్కరణ



తిరుపతి(కల్చరల్), ఆగస్టు 29 :రాజన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగే గల్లా అరుణకుమారి స్వీయ చరిత్ర పుస్తకావిష్కరణ సభకు ద్రవిడ విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి కొలకలూరి మధుజ్యోతి అధ్యక్షత వహిస్తారు. ప్రముఖ రచయిత్రి ఓల్గా పుస్తకాన్ని అవిష్కరిస్తారు. ప్రసిద్ధ ప్రచురణ సంస్థ ఎమెస్కో సంపాదకుడు డి. చంద్రశేఖరరెడ్డి పుస్తకాన్ని సమీక్షిస్తారు. ముఖ్య అతిథులుగా సీనియర్ పాత్రికేయులు మానుకొండ నాగేశ్వరరావు, ఆర్.ఎం. ఉమామహేశ్వరరావు పాల్గొంటారు.

వేదిక : అమరరాజ ఆడిటోరియం, కరకంబాడి
సమయం : శుక్రవారం ఉదయం 10 గంటలకు

తెలుగు రాజకీయాల అంతరాత్మ కధ

గల్లా అరుణకుమారి స్వీయ చరిత్ర

ఉమ్మడి చిత్తూరు జిల్లా రాజకీయ, సాంస్కృతిక, సాహిత్య, సేవా రంగాల చరిత్రలో ఎన్నటికీ చెరగని పేరు పాటూరి రాజగోపాలనాయుడు. నిరాడంబరత, సేవాదృక్పథం, ఒరిమిగల రాజకీయం, గురుభక్తి, స్నేహశీలత వంటి ఉన్నత గుణాల సమాహారం ఆయన. పసి వయసునుంచే ఆయన చేయి పట్టుకుని నడిచిన తల్లిలేని బిడ్డ గల్లా అరుణకుమారి. పీయూసీతో ఆగిపోయిన చదువును, పెండ్లైన భర్త రామచంద్రనాయుడు వెంట అమెరికా వెళ్లిన తర్వాత ఆమె కొనసాగించారు. నలభై ఏళ్ల కిందటే అమెరికాలో కంప్యూటర్స్ కోర్సు చేసి, ప్రసిద్ధ కార్ల కంపెనీలో తొమ్మిదేళ్లకు పైగా ఉద్యోగం చేశారు.పుట్టిన నేల మీద ఫ్యాక్టరీ పెట్టాలనే రామచంద్రనాయుడు ఆలోచనలకు బాసటగా భర్తతో కలిసి తిరిగి వచ్చిన అరుణకుమారి అనుకోని పరిస్థితుల్లో పూర్తి ప్రతికూల వాతావరణంలో రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. ఇక అక్కడి నుంచీ ఆమెది పోరాటమే. ప్రత్యర్థి పార్టీతో మాత్రమే కాదు, సొంత పార్టీలోనూ ఆమె తలపడక తప్పని పరిస్థితులనే ఎదుర్కొన్నారు.ఈ పరిణామాలన్నింటినీ గల్లా అరుణకుమారి అక్షరమక్షరం గుదిగుచ్చి స్వీయచరిత్రగా లిఖించారు. వెయ్యి పేజీల ఈ పుస్తకం నేడు తిరుపతిలో విడుదల అవుతోంది. వేలాదికోట్ల వ్యాపార సామ్రాజ్యంగా విస్తరించినా దిగువ మాఘం పల్లెబిడ్డగానే ఇప్పటికీ ఆమె మాటా, తీరూ ఉండడం విశేషం. పదహారేళ్ల అమెరికాలో ఉన్నా, ఇరవై ఏళ్ల ఎమ్మెల్యేగా, మూడు పర్యాయాలు మంత్రిగా చేసినా ఆమె గొంతులో ఇప్పటికీ చిత్తూరు యాస సొగసుగానే పలుకుతుంది.భారత దేశానికి స్వాతంత్ర్యం ప్రకటించడానికి సరిగ్గా పదహైదు రోజుల ముందు పుట్టిన గల్లా అరుణకుమారి తల్లి కూడా పోరాట యోధురాలే. తెల్ల దొరలపై తిరుగుబాటుగా భర్త రాజగోపాలనాయుడు నడిపిన రాత పత్రికను ఆయన అరెస్టు తర్వాత కొనసాగించిన ధీరురాలు. నిండు చూలాలుగా జైలు శిక్ష అనుభవించి జబ్బుపడి విడుదలై బిడ్డను కన్న కొద్ది కాలానికే కన్నుమూసిన అమరావతి జ్ఞాపకాలను కడుపులో దాచుకున్న కన్నీటితో తన స్వీయచరిత్రలో నమోదు చేశారు అరుణకుమారి. రాజీవ్ గాంధీ నుంచి రాజకుమారి దాకా నిలదీసే స్వభావమే ఆమెను రాజకీయాల్లో నిరంతరం అస్థిరంగా ఉంచిందని ఈ పుస్తకం వెల్లడిస్తోంది. చిత్తూరు జిల్లాలో వివిధ ఎన్నికల్లో గ్రామాల్లో ఎదురైన సంఘటనలనూ, అప్పటి మనుషులనూ మరచిపోకుండా తన స్వీయచరిత్రలో ఆమె గుర్తు చేసుకున్నారు. కోట్ల విజయభాస్కరరెడ్డితో, వైఎస్ రాజశేఖరరెడ్డితో, చెన్నారెడ్డి, నేదురుమల్లి జనార్దనరెడ్డి, చంద్రబాబు సహా పలువురు నాయకులతో విభేదించిన సందర్భాలనూ, వారి అభిమానం చూరగొన్న సమయాలనూ ఆమె రాశారు. తెలుగునేల మీద నాలుగు దశాబ్దాలకు పైగా సాగిన రాజకీయాల ఆత్మగుట్టు విప్పి చెప్పారు అరుణకుమారి. సరళంగా కథలా సాగే గల్లా అరుణకుమారి స్వీయ చరిత్ర విడుదలయ్యాక వర్తమాన రాజకీయ నాయకులకు ఒక పాఠంగా ఉపయోగపడుతుంది.



- తిరుపతి, ఆంధ్రజ్యోతి

2,67,089 మంది పింఛన్లకోసం రూ.113 కోట్ల కేటాయింపు

రేపే పంపిణీకి విస్తృత ఏర్పాట్లు

తిరుపతి(కలెక్టరేట్/విద్య), ఆగస్టు 29: ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్ల పంపిణీని ఈనెల 31వ తేదీ ఉదయం ఆరు గంటలనుంచే ప్రారంభించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి అన్ని మండలాల ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, సచివాలయాల సిబ్బందితో వర్చువల్‌గా సమావేశమయ్యారు. సెప్టెంబరు ఒకటో తేదీన ఆదివారం సెలవు దినం కావడంతో ఒకరోజు ముందుగానే లబ్ధిదారులకు పింఛను సొమ్మును ఉదయం ఆరు గంటల నుంచే ఇళ్ల వద్దకెళ్లి అందజేయాలన్నారు. ఇందుకోసం శుక్రవారం బ్యాంకుల నుంచి డబ్బు డ్రాచేసి సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. గతంలో ఆలస్యంగా పంపిణీ చేసిన సచివాలయ సిబ్బందితో మాట్లాడి పునరావృతం కాకుండా చూసుకోవాలని హెచ్చరించారు. ఒక రోజులోనే వంద శాతం పింఛన్ల పంపిణీని పూర్తి చేయాలని చెప్పారు. ఏవైనా కారణాలతో మిగిలిన వారికి రెండో తేదీన అందజేయాలన్నారు. లబ్ధిదారులు కూడా శనివారం ఇళ్ల వద్దనే ఉండి పింఛను సొమ్ము తీసుకోవాలని కోరారు. జిల్లా, గ్రామ వార్డు సచివాలయ అధికారి సుశీలాదేవి, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ పథక సంచాలకులు ప్రభావతి, ఎల్డీఎం విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు. కాగా జిల్లాలోని 691 సచివాలయాల పరిధిలో వితంతు, వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళల తదితర లబ్ధిదారులు 2,67,089మంది ఉన్నారు. వీరికోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.113కోట్లను కేటాయించింది. అలాగే లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేయడానికి 5,827 సచివాలయ సిబ్బందిని నియమించారు.

బస్సు బోల్తా

ఏడుగురికి గాయాలు

పంట పొలంలో బోల్తాపడిన ఆర్టీసీ బస్సు



చిల్లకూరు, ఆగస్టు 29: చిల్లకూరు మండలం మోమిడి గ్రామ సమీపంలోని పొలాల్లో గురువారం ఓ ఆర్టీసీబస్సు బోల్తాపడి ఏడుగురికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు...నెల్లూరు నుంచి ముత్తుకూరు మీదుగా 34మంది ప్రయాణికులతో కోటకు వెళుతున్న వాకాడు డిపో ఆర్టీసీ బస్సు మోమిడి గ్రామ సమీపంలో అదుపుతప్పి పొలాల్లోకి బోల్తాపడింది. దీంతో బస్సులో ప్రయాణిస్తున్న వాకాడు మండలం సింగనేటూరు గ్రామానికి చెందిన చిన్నమ్మ, చిల్లకూరు మండలం కొమరావారిపాళెం గ్రామానికి చెందిన అంకమ్మ, గుమ్మళ్లదిబ్బకు చెందిన హసీంబీ, ముంతాజ్, లింగవరానికి చెందిన ప్రవళ్లిక, తమ్మినపట్నానికి చెందిన వెంకటమ్మ, వరగలికి చెందిన నిఖితకు గాయాలయ్యాయి.వారిని చికిత్స నిమిత్తం వరగలి పీహెచ్‌సీకి తరలించారు. అక్కడినుంచి చిన్నమ్మ, అంకమ్మలను మెరుగైన వైద్యం కోసం నెల్లూరు తరలించారు.పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



గాయపడిన ప్రయాణికురాలు

రాజీవ్‌నగర్ కాలనీపై

విచారణ వాయిదా

శ్రీకాళహస్తి, ఆగస్టు 29:శ్రీకాళహస్తిలోని రాజీవ్‌నగర్ కాలనీలో యేళ్ల తరబడి జరిగిన భూ అక్రమాలపై శుక్రవారం జరగాల్సిన సమగ్ర విచారణ సెప్టెంబరు 2వ తేదీకి వాయిదా పడిందని తహసీల్దారు లక్ష్మీనారాయణ గురువారం ప్రకటనలో తెలిపారు. సెప్టెంబరు 1వ తేదీ జరగాల్సిన పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఆదివారం సెలవురోజు కావడంతో ముందు రోజైన శనివారం పంపిణీ చేసేందుకు ప్రభుత్వం నిశ్చయించిందని తెలిపారు. పింఛన్ల పంపిణీ కోసం శుక్రవారం నుంచే అధికారులు అవసరమైన ఏర్పాట్లతో సంసిద్ధంగా ఉండాల్సి రావడంతో రాజీవ్‌నగర్‌లో అక్రమాలపై జరగాల్సిన సర్వే కార్యక్రమాన్ని సోమవారానికి వాయిదా వేసినట్లు వెల్లడించారు.

పలువురు ఎస్‌ఐలకు పోస్టింగ్

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 29: జిల్లాలో వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న వారికి, వీఆర్‌లో ఉన్న ఎస్‌ఐలకు పోస్టింగ్‌లు ఇస్తూ ఎస్పీ సుబ్బరాయుడు గురువారం ఆదేశాలు జారీ చేశారు. తిరుపతి ఈస్ట్ ఎస్‌ఐగా ఇప్పటి వరకు ఎంఆర్‌పల్లెలో పనిచేసిన నాగేంద్రబాబును నియమించారు. ఇక్కడ పనిచేస్తున్న శ్రీకాంత్‌రెడ్డిని వీఆర్‌కు పంపారు. తొట్టంబేడుకు ఈశ్వర్‌ను, సత్యవేడుకు అలిపిరిలో పనిచేస్తున్న రామస్వామిని, అలిపిరిలో ఉన్న రాజశేఖర్‌ను వీఆర్‌కు, లోకేష్‌ను వీఆర్ నుంచి అలిపిరికి నియమించారు. ఇప్పటివరకు క్రైంలో పనిచేసిన సాయినాథ్ చౌదరిని తిరుచానూరు స్టేషన్‌కు నియమించారు.

చంద్రగిరి ఇన్‌చార్జి డీఎస్పీగా వెంకటనారాయణ

చంద్రగిరి ఇన్‌చార్జి డీఎస్పీగా తిరుపతి డీఎస్పీ వెంకటనారాయణను నియమిస్తూ ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం ఇక్కడ ఇన్‌చార్జిగా ఉన్న నరసింగప్ప సెలవుపై వెళ్లడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. అలాగే తిరుపతి రూరల్ సీఐగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సాదిక్ ఆలీ సెలవుపై వెళ్లడంతో ఇన్‌చార్జి సీఐగా సునీల్‌కుమార్‌ను నియమించారు.

తెలుగులోనే మాట్లాడదాం : కలెక్టర్



భాషాకోవిదులతో కలెక్టర్, అధికారులు

తిరుపతి(విద్య), ఆగస్టు 29: మాతృభాషను గౌరవిద్దాం.. తెలుగు భాషలోనే మాట్లాడదాం అని కలెక్టర్ వెంకటేశ్వర్ పిలుపునిచ్చారు. వ్యవహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవాన్ని కలెక్టరేట్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ శుభం భన్సల్, డీఆర్వో పెంచల కిషోర్ తదితర అధికారులతో కలిసి కలెక్టర్ గిడుగు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. వ్యవహారిక భాషకు గిడుగు ప్రాణం పోశారని కలెక్టర్ చెప్పారు. జేసీ మాట్లాడుతూ.. తెలుగు భాష తీయనైనదని, కమ్మనైనదనీ కొనియాడారు. డీఆర్వో మాట్లాడుతూ.. తెలుగును సరళ భాషగా అందుబాటులోకి తీసుకొచ్చిన మహనీయుడు గిడుగు అని ప్రస్తుతించారు. అనంతరం పలువురు తెలుగు భాషా కోవిదులను సన్మానించారు. డీపీఆర్వో బాలకొండయ్య, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

స్విమ్స్‌లో రోగి అదృశ్యంపై పోలీసుల విచారణ



స్విమ్స్‌లో బాధితులను అడిగి వివరాలు సేకరిస్తున్న సీఐ రామకృష్ణ

తిరుపతి(వైద్యం), ఆగస్టు 29 :తిరుపతి స్విమ్స్ శ్రీపద్మావతి భవనంలోని ఎంఐసీయూ వార్డులో చికిత్స పొందుతూ కనిపించకుండా పోయిన టి.సీతారామప్ప ఆచూకీ గురువారం కూడా లభించలేదు.అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం బూరగమాకులపల్లెకు చెందిన టి.సీతారామప్ప(65)కన్పించకపోవడంపై 'స్విమ్స్‌లో రోగి అదృశ్యం' శీర్షికన ఆంధ్రజ్యోతిలో గురువారం కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీంతో స్పందించిన పోలీసులు, స్విమ్స్ యాజమాన్యం ఆస్పత్రి ఆవరణలో, పరిసర ప్రాంతాల్లో గురువారం ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. డైరెక్టర్ ఆర్వీకుమార్ బాధితులతో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే రోగి ఆచూకీ కోసం వెస్ట్ సీఐ రామకృష్ణ ఆయన బృందంతో కలిసి ఆస్పత్రిలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా సీతారామప్ప చికిత్స పొందుతున్న వార్డును పరిశీలించి అక్కడి సిబ్బందిని విచారించారు. స్విమ్స్ ఆవరణలోని సీసీ కెమెరాలను పరిశీలించారు. స్విమ్స్ సెక్యూరిటీ సిబ్బంది ఆస్పత్రి పరిసరాలతో పాటు బర్డ్, రుయా ఆస్పత్రి పరిసరాల్లోనూ గాలింపు చర్యలు చేపట్టినట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అయితే అదృశ్యమైన రోగి వృద్ధుడు కావడం, నాల్గవ అంతస్తు నుంచి కిందకు వచ్చే పరిస్థితి లేకపోవడంతో పాటు బయటకు వెళితే కనీసం ఆ దృశ్యాలు కూడా సీసీ కెమెరాల్లో రికార్డు కాకపోవడం ఆశ్చర్యానికి గురి చేస్తున్నట్లు స్విమ్స్ సిబ్బంది చెబుతున్నారు.

ఎమ్మార్పీఎస్ నేతల నిరసన : స్విమ్స్‌లో పేషెంట్ సీతారామప్ప కన్పించకుండా పోవడానికి ఆస్పత్రి అధికారుల నిర్లక్ష్యమే కారణమంటూ ఎమ్మార్పీఎస్, బీసీ విద్యార్థి సంఘం నేతలు గురువారం నిరసన వ్యక్తం చేశారు.బాధ్యులపై తక్షణమే చర్యలు తీసుకోవడంతోపాటు తప్పిపోయిన రోగిని త్వరితగతిన కుటుంబసభ్యులకు అప్పగించాలని డిమాండు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నేత పులికుంట్ల గోపి, బీసీ సంక్షేమ సంఘం నేత తురకా అమర్నాథ్, బీసీ విద్యార్థి సంఘం నేత రాజేష్ మాట్లాడుతూ టీటీడీ ఈవో స్పందించాలని కోరారు. దీంతో స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీకుమార్ వారికి సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. శుక్రవారం ఉదయం 9 గంటల లోపు సీతారామప్ప ఆచూకీ కనిపెట్టకపోతే ఆందోళనకార్యక్రమాలు ఉద్రుతం చేస్తామని హెచ్చరించారు.



ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకుంటున్న పలమనేరు బాలాజి, విజయలక్ష్మి

తెలుగు భాషా పురస్కారాల ప్రదానం

తిరుపతి(విశ్వవిద్యాలయాలు)/పలమనేరు, ఆగస్టు29 : తెలుగు భాషా సాహిత్య రంగాల్లో చేసిన కృషికి గుర్తింపుగా ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన ఇద్దరు ప్రముఖులను రాష్ట్రప్రభుత్వం తెలుగు భాషా పురస్కారాలతో సత్కరించింది.విజయవాడలోని తుమ్మలపల్లె కళా క్షేత్రంలో గురువారం సాయంత్రం నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు , ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేతుల మీదుగా ఈ పురస్కారాలను అందుకున్నారు.వీరిలో తిరుపతిలోని మహిళా విశ్వవిద్యాలయం తెలుగు విశ్రాంతాచార్యులు మూలె విజయలక్ష్మి, చిత్తూరు జిల్లాకు చెందిన పలమనేరు బాలాజి వున్నారు.30 ఏళ్ల తెలుగు భాషా సాహిత్య బోధనలో 28 పీహెచ్‌డీలు, 7ఎంఫిల్ డిగ్రీలకు ఆచార్య విజయలక్ష్మి పర్యవేక్షకురాలిగా వ్యవహరించారు.14 పుస్తకాలు,108 పరిశోధనా వ్యాసాలు రాశారు.పలమనేరుకు చెందిన బాలాజీ కవిత్వం, కథ, విమర్శ రంగాల్లో కృషి చేశారు.ఇప్పటిదాకా ఆయన రచనలు ఆరు పుస్తకాలుగా వెలువడ్డాయి.కొన్ని కథలు,కవితలు కన్నడ,తమిళ, ఆంగ్ల భాషల్లో అనువాదమయ్యాయి.

వైభవంగా మాతృభాష దినోత్సవం



గిడుగు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

నాయుడుపేట టౌన్, ఆగస్టు 29: తెలుగుభాషా పితామహుడు గిడుగు రామమూర్తి జయంతిని పురస్కరించుకొని గురువారం తెలుగుభాషా దినోత్సవాన్ని పలు పాఠశాలలు, కళాశాలల్లో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఎల్‌ఏసాగరం ఉన్నత పాఠశాల ప్రాంగణంలో గిడుగు వెంకటరామమూర్తి పంతులు చిత్రపటానికి నివాళులర్పించారు. ప్రధానోపాధ్యాయురాలు అన్నామణి తెలుగుభాష ప్రాముఖ్యతను వివరించారు. అదేవిధంగా క్రీడా దినోత్సవాన్ని కూడా నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి.వెంకటేశ్వర్లు, గురునాథం, కిరణ్, సూర్యారావు, వెంకటరావు, సుబ్రహ్మణ్యం, విద్యార్థులు పాల్గొన్నారు.

నాయుడుపేట: దేశభాషలందు తెలుగులెస్స అని తేనెలూరే తెలుగు భాష ఎంతో కమ్మనైనదని బాలుర గురుకులం ప్రిన్సిపాల్ డాక్టర్ దాదాపీర్ అన్నారు. నాయుడుపేట ఎల్‌ఏసాగరంలోని గురుకులంలో గిడుగు రామమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి విద్యార్థులతోపాటు ఘన నివాళులర్పించారు. మల్లికార్జునరావు, మోహన్‌రావు, రాజశేఖర్, వెంకటకృష్ణయ్య, బందిల శేఖర్, రమణయ్య తదితరులు ఉన్నారు.

వెంకటగిరిటౌన్: పట్టణంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానో



గిడుగు రామమూర్తికి నివాళులు అర్పిస్తున్న ఉపాధ్యాయులు

పాధ్యాయురాలు లత, జడ్పీఉన్నత పాఠశాల వాణి, ఏపీ మోడల్ స్కూల్‌లో తులసీజ్యోతి, భాష్యం పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఏపీ మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు ఆయన జీవిత చరిత్రపై క్విజ్ పోటీలు, వ్యాసరచన పోటీలు, పద్య పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

గూడూరు: తెలుగుభాష వ్యాప్తికి గిడుగు వెంకటరామమూర్తి ఎనలేని కృషిచేశారని మినర్వా పాఠశాల ప్రిన్సిపాల్ రాంప్రసాద్ అన్నారు. స్థానిక మినర్వాపాఠశాలలో గిడుగు రామమూర్తి చిత్రపటానికి నివాళులర్పించి విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో రమణ, ఉషా, డాక్టర్ తనూజ, జీవని, స్నేహలత తదితరులు పాల్గొన్నారు.

చిల్లకూరు: పారిచెర్లవారిపాళెం జడ్పీ ఉన్నత పాఠశాలలో గిడుగు రామ్మూర్తి, ధ్యాన్‌చంద్ చిత్రపటాల వద్ద విద్యార్థులు, ఉపాధ్యాయులు నివాళులర్పించారు. విద్యార్థులకు క్విజ్‌పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో రవూఫ్, హెచ్‌ఎం సుధాకర్, ప్రజేంద్రరెడ్డి, మాధవయ్య, ఆదిలక్ష్మి, షకీలా, వేణుగోపాల్‌రెడ్డి, కామేశ్వరి, చంద్రశేఖర్, కుమార్, ఏలియా తదితరులు పాల్గొన్నారు. చింతవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగుభాష, జాతీయక్రీడా దినోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శివసుబ్రమణ్యం, కోదండ రామారావు, అమ్మణ్ణి, మెహర్రాజ్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



చింతవరంలో కవుల వేషధారణలో విద్యార్థులు

సూళ్లూరుపేట: సూళ్లూరుపేటలోని వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ఎల్‌బీ శంకర్ శర్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముప్పా వృషాద్రిపతి పాల్గొని తెలుగు కవిత్వం, తెలుగు గొప్పతనాన్ని వివరించారు. అధ్యాపకులు ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

కోట: కోటలోని మహాత్మాజ్యోతిబా పూలే బీసీ బాలుర, విద్యానగర్‌లోని మహాత్మాజ్యోతిబా పూలే బీసీ బాలికల గురుకులాల్లో ప్రిన్సిపాల్‌లు కొరాడా నారాయణరావు, అంజనమ్మ, ఉపాధ్యాయులు గిడుగు రామమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

చిట్టమూరు: మండల పరిధిలోని కొత్తగుంట టీఎంఆర్ పాఠశాలలో తెలుగు భాష కోసం కృషి చేసిన కవులు, శ్రీకృష్ణదేవరాయలు తదితర పండితుల వేషధారణలో చిన్నారులు అలరించారు. తెలుగుభాష గొప్పతనంపై పాటలు, నృత్యకార్యక్రమాలు చేపట్టారు. టీఎంఆర్ విద్యా సంస్థల అధినేత టీఎం మనోహర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రహంతుల్లా, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలి



ధ్యాన్‌చంద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న హాకీ క్రీడాకారులు

గూడూరు, ఆగస్టు 29: ధ్యాన్‌చంద్‌ను ఆదర్శంగా తీసుకుని నేటితరం క్రీడాకారులు ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలని హాకీ కోచ్ దీపక్‌ఆకాష్ అన్నారు. గురువారం స్థానిక ఏఏరెడ్డి ప్రభుత్వ స్టేడియంలో మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటం వద్ద హాకీ క్రీడాకారులు నివాళులర్పించారు. హాకీ క్రీడాకారులు పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక రోటరీభవన్‌లో పట్టణంలోని పలు పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన క్విజ్‌పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు. డాక్టర్ జనార్ధన్‌రెడ్డి, మునిగిరీష్, దశరధరామిరెడ్డి, క్రిష్ణయ్య, జీజీనాయుడు, మయూరి శ్యామ్‌యాదవ్, రాంప్రసాద్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

నాయుడుపేట, ఆగస్టు 29: నేడు అన్ని రంగాలలో తీవ్ర పోటీతత్వంతో మానసిక ఒత్తిళ్లకు గురవుతున్నారని, వాటిని అధిగమించేందుకు క్రీడలతో మానసిక ఉల్లాసంతోపాటు దేహధారుడ్యం కలుగుతుందని మున్సిపాలిటీ వైస్ చైర్మన్ షేక్ రఫీ అన్నారు. నాయుడుపేటలోని బాషా ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా కరస్పాండెంట్ షేక్ రఫీబాషా వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు క్రికెట్ పోటీలు నిర్వహించారు. విన్నర్‌గా నారాయణ స్కూల్ టీమ్, రన్నర్‌గా నిలిచిన సెయింట్ మేరీస్ స్కూల్ టీమ్‌కు ట్రోఫీలు, బహుమతులు అందజేశారు. హాజీ రహంతుల్లా, ప్రిన్సిపాల్ హమీద్, రహమాన్, షాహిద్, అబుబకర్, అసరత్, ప్రసాద్, శ్యామ్ తదితరులు ఉన్నారు.

కోట: మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాల, స్థానిక బాలికల గురుకుల పాఠశాల, కోట బాలుర గురుకులాలల్లో చిత్రపటానికి ప్రిన్సిపాల్‌లు నారాయణరావు, అంజమ్మ, డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి పూలమాలలువేసి నివాళులర్పించారు. స్థానిక ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట మున్సిపల్ కమిషనర్ బదిలీ

సూళ్లూరుపేట, ఆగస్టు 29: సూళ్లూరుపేట మున్సిపాలిటీ కమిషనర్ చెల్లు గంగాప్రసాద్‌ను ఆత్మకూరు మున్సిపాలిటీకి బదిలీ చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా రాయచోటి కమిషనర్‌గా ఉన్న ఈయన సూళ్లూరుపేటకు వచ్చి అప్పటి నుంచి కొనసాగుతున్నారు. ప్రస్తుతం సాధారణ బదిలీల్లో భాగంగా ఈయనను బదిలీ చేశారు. శుక్రవారం రిలీవ్‌కానున్నారు. మరో రెండురోజుల్లో సూళ్లూరుపేట మున్సిపాలిటీకి కొత్త కమిషనర్‌ను నియమించనున్నట్లు సమాచారం.

ఉచిత కంటివైద్య శిబిరం

బాలాయపల్లి, ఆగస్టు 29: మండలంలోని జయంపు గ్రామంలో చాగణం లలితమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీవెంకటేశ్వర అరవింద్ నేత్రాలయం తిరుపతి వారి సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్యులు అర్చన, కీర్తి 175 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, 35 మందికి కంటి అద్దాలు, 80 మందికి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. 40 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. మేనేజింగ్ ట్రస్టీ గౌరీశంకర్, సీతారామా నాయుడు, కృష్ణ, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

జలజీవన్ పనులకు ప్రాధాన్యత ఇవ్వండి

● పూర్తయిన వాటికి బిల్లులు సిద్ధం చేయండి ● జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో చైర్‌పర్సన్ ఆదేశం



జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో పాల్గొన్న చైర్‌పర్సన్ అరుణమ్మ, ఎమ్మెల్యే విజయశ్రీ, అధికారులు

నెల్లూరు (జడ్పీ), ఆగస్టు 29: జిల్లాలో ప్రతి ఇంటికి తాగునీటిని అందించాలన్న లక్ష్యంతో ఏర్పాటు చేసిన జలజీవన్ మిషన్ పనులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి త్వరితగతిన పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం నెల్లూరులోని జిల్లా పరిషత్ కార్యాలయంలో చైర్‌పర్సన్ అధ్యక్షతన జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఇంజనీరింగ్ శాఖలపై సమగ్రంగా చర్చించారు. గత ప్రభుత్వంలో చేపట్టిన సచివాలయాలు, ఆర్బీకేలు, వివిధ భవనాలు, ఇతర పనులకు సంబంధించి బిల్లులు పెండింగ్ ఉన్నాయని, నాలుగేళ్ళగా మొత్తుకుంటున్నా పూర్తయిన పనులకు బిల్లులు రాలేదని, ఇప్పటికైనా వాటిని మంజూరు చేయించాలని జడ్పీటీసీ సభ్యులు మల్లు సుధాకర్‌రెడ్డి, మాల్యాద్రి, వెంకట్రావు, రాఘవులు తదితర సభ్యులు విన్నవించారు. అలాగే రోడ్ల పనులు మంజూరైనా ఇంతవరకు టెండర్లు పిలవలేదని, ఎక్కడి పనులు అక్కడే ఉన్నాయని వాపోయారు. జలజీవన్ పనులు సక్రమంగా జరగలేదని, స్థానిక ఎంపీడీవోలు పనుల పర్యవేక్షణకు ప్రాధాన్యత ఇవ్వలేదని మండిపడ్డారు. దీంతో జడ్పీ చైర్‌పర్సన్, సీఈవో కన్నమ నాయుడు మాట్లాడుతూ పనులు పూర్తయిన వాటికి ఎంబుక్‌ల రికార్డులను ఇంజనీరింగ్ అధికారులు సిద్ధం చేయాలన్నారు. పార్టీలకతీతంగా బిల్లులకు సంబంధించి రికార్డులను సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాలని సూచించారు. ప్రస్తుతం జలజీవన్ పనులపై సర్వే జరుగుతున్నందున ప్రజాప్రతినిధులంతా మండలస్థాయిలో సమీక్షించి, ఆ పనుల్లో లోటుపాట్లను సరిదిద్దేందుకు సహకరించాలని కోరారు.

● తాగునీటి పథకాలకు సౌరవిద్యుత్తు

జిల్లాలో పంచాయతీలకు విద్యుత్ బిల్లుల భారం నుంచి విముక్తి కలిగించేందుకు సౌరవిద్యుత్తు ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ సూచించినట్లు సీఈవో కన్నమ నాయుడు జడ్పీటీసీలు, అధికారులకు తెలిపారు. తొలిగా మంచినీటి పథకాలకు అవసరమైన సౌర విద్యుత్తును వినియోగించుకునేందుకు ప్రతిపాదనలను సిద్ధం చేయించుకోవాలన్నారు. దీంతో బిల్లుల భారం పూర్తిగా తగ్గిపోతుందని తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు త్వరితగతిన ప్రతిపాదనలు సిద్ధం చేసుకుంటే వాటి మంజూరుకు నివేదికలను కలెక్టర్‌కు పంపడం జరుగుతుందన్నారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ పాల్గొన్నారు.

మట్టి పోసి మమ అనిపించారు

● వర్షమొస్తే రోడ్డుపై కష్టాలు మామూలే
● రెండులైన్ల విస్తరణ కోసం నిరీక్షణ





సాధనవారిపాళెం దగ్గర రోడ్డు ప్రక్కన తోలిన మట్టిని రోలింగ్ చేస్తున్న రోలర్ - గాజులపెళ్లూరు దగ్గర ఉన్న రోడ్డుకు మట్టి తోలకపోవడంతో ఇరుక్కున్న వాహనాలు

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 29: సూళ్ళూరుపేట-బుచ్చినాయుడు కండ్రిగ రహదారి గత ఐదేళ్లగా అధ్వానంగా తయారైంది. గతంలో సింగిల్ రోడ్డుగా ఉన్నా వాహన రాకపోకలు తక్కువగా ఉండేవి. పెద్దగా సమస్యలు ఎదురయ్యేవి కావు. ప్రస్తుతం సూళ్లూరుపేట, వరదయ్యపాళెం మండలాల్లో భారీ సంఖ్యలో పరిశ్రమలు ఆవిర్భవించాయి. అదే స్థాయిలో వాహనాల రద్దీ కూడా పెరిగింది. దీంతో ఈ సింగిల్ రోడ్డులో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈనేపథ్యంలో ఇటీవల శ్రీహరికోటలోని షార్‌ని సందర్శించేందుకు వచ్చిన ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి తమ రహదారి ఇబ్బందులను స్థానిక నాయకులు తీసుకువెళ్లారు. వెంటనే ఉప ముఖ్యమంత్రి స్పందించారు. రహదా రి పనులు చేపట్టాలని ఆయన సంబంధిత అధికారులను ఆదేశించారు. దీంతో రహదారికి ఇరువైపుల మట్టి పోశారు. రహదారి మధ్యలో గుంతలు పూడ్చారు. కొంతమేర ప్యాచ్ పనులూ చేపట్టారు. కానీ ప్రస్తుతం చేపడుతున్న పనులు తాత్కాలికమేనని వాహనదారులు చోదకులు పెదవి విరుస్తున్నారు. మోస్తరు వర్షం కురిసినా ఈ రహదారి గతంలో మాదిరిగా గుంతలుగా మారుతుందంటున్నారు. బీఎన్‌కండ్రిగ నుంచి గాజులపెళ్లూరు వరకు అసలు పనులే చేపట్టకపోవడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. రెండు వరుసల(డబుల్) రహదారి నిర్మాణమొక్కటే శాశ్వత పరిష్కారమని ఇక్కడి ప్రజలు చెబుతున్నారు. ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

అజాత శత్రువు వెంకటరెడ్డి

- ఎమ్మెల్యేలు సోమిరెడ్డి, కురుగొండ్ల



మాట్లాడుతున్న సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి

దక్కిలి, ఆగస్టు 29: టీడీపీ సీనియర్ నేత, దక్కిలి మాజీ ఎంపీపీ పోలంరెడ్డి వెంకటరెడ్డి అజాత శత్రువని, అలాంటి వ్యక్తి దూరం కావడం బాధాకరమని సర్వేపల్లి, వెంకటగిరి ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. మండలంలోని మాటుమడుగు గ్రామంలో గురువారం ఏర్పాటు చేసిన సంస్మరణ సభలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి కడదాకా పార్టీలో కొనసాగిన వెంకటరెడ్డి మరణాన్ని జీర్ణించుకోలేక పోతున్నామని అన్నారు. వెంకటరెడ్డి సర్పంచ్‌గా, సొసైటీ అధ్యక్షుడిగా, ఎంపీపీగా, 25 ఏళ్ల పాటు టీడీపీకి శాశ్వత అధ్యక్షుడిగా పనిచేశారని చెప్పారు. పోలంరెడ్డికి నివాళులు అర్పించిన వారిలో నియోజకవర్గ టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ కురుగొండ్ల లక్ష్మీసాయిప్రియ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంగోటి నాగేశ్వరరావు, వేనాటి సతీష్ రెడ్డి, నెల్లూరు డీపీవో సుస్మిత రెడ్డి, రాష్ట్ర తెలుగుయువత ఉపాధ్యక్షుడు కేవీకే ప్రసాద్ నాయుడు, టీడీపీ నాయకులు ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, పప్పు చంద్రమౌళి రెడ్డి, రావి సత్యం, రావి మస్తాన్ నాయుడు, అవ్వారు సత్యనారాయణ, రంగినేని రాజా, వేముల నాగభూషణం నాయుడు, దక్కిలి చంద్రారెడ్డి, గడ్డం చంద్రశేఖరరెడ్డి, బైవర్ బ్రదర్స్, పులి జనార్దనరెడ్డి, చెన్ను తిరుపాల్ రెడ్డి, వేపమాను యువరాజ్, రాములు, వెంకటపతి, డి.వడ్డిపల్లి సర్పంచ్ చెంచమ్మ ఉన్నారు.

అండర్ బ్రిడ్జి నిర్మాణం ఆలస్యంపై నేడు ధర్నా

తడ, ఆగస్టు 29: పెరియవట్టు రైల్వేగేట్ నిర్మాణం ఆలస్యం కావడంతో గ్రామస్థులు శుక్రవారం ధర్నాకు పిలుపునిచ్చారు. పెరియవట్టు రైల్వేగేట్ నెంబరు 43 వద్ద బాక్స్‌టైపు బ్రిడ్జి నిర్మాణానికి గత ఏడాది ఫిబ్రవరిలో రైల్వే అధికారులు అనుమతులు ఇచ్చారు. కాంట్రాక్ట్ పొందిన గుత్తేదారుడు అదే ఏడాది మార్చిలో పనులను మొదలుపెట్టాడు. అప్పటి నుంచి రైల్వేగేట్ మూతపడి గ్రామస్థుల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఏడాదిన్నర గడిచినా పనులు పూర్తికాకపోవడంతో గ్రామస్థులు ఈ విషయాన్ని పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. జిల్లా కలెక్టర్ సైతం కల్పించుకొని చెన్నై సదరన్ రైల్వే అధికారులతో మాట్లాడినా ఫలితం లేకపోవడంతో శుక్రవారం ధర్నా చేయాలని గ్రామస్థులు నిర్ణయించారు. ఆమేరకు గురువారమే అధికారులకు సమాచారం అందించారు. ఈ సందర్భంగా రైళ్లు నిలిచిపోయినా తమకు సంబంధం లేదంటూ అధికారులకు తెలిపారు. స్పందించిన అధికారులు రైల్వే అధికారులతో సంప్రదింపులు జరిపారు. మరోపక్క సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ, ఎస్‌ఐ కొండపనాయుడులు గ్రామానికి చేరుకొని గ్రామస్థులతో మాట్లాడారు. ధర్నాకు దిగవద్దని, రైల్వే ట్రాక్‌పై ధర్నాకు దిగితే చట్టరీత్యానేరమని, తద్వారా కేసులు ఎదుర్కోవాల్సివస్తుందని సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. శుక్రవారం నుంచి పనులు మొదలుకాకుంటే తాము ధర్నాకు దిగేది ఖాయమని, ఎన్ని కేసులు పెట్టినా వెనక్కుతగ్గేదిలేదంటూ గ్రామస్థులు తేల్చిచెప్పారు. మరి శుక్రవారం పనులు మొదలవుతాయో లేక గ్రామస్థులు ధర్నాకు దిగుతారో చూడాల్సి ఉంది.

వారం రోజులుగా తాగునీటికి కటకట

చిట్టమూరు, ఆగస్టు 29: వాకాడు రాజీవ్ టెక్నాలజి నీటి సరఫరా వారం రోజుల పాటు నిలిచిపోవడంతో చిట్టమూరు మండలంలోని పలు గ్రామాల్లో తాగునీరు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాకాడు స్వర్ణముఖి నది నుంచి మండలంలోని పలు గ్రామాలకు తాగు నీరు సరఫరా అవుతుంది. వాకాడు దగ్గర ఏర్పాటు చేసిన మోటార్ల వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. దాంతో మోటార్లు పనిచేయక నీటి సరఫరా నిలిచిపోయింది. మండలంలోని కొత్తగుంట, కోగిలి, ఎల్లూరు, వెలుగాజులపల్లి, బురదగాలి, కొత్తపాళెం, కుమ్మరపాళెం, వళ్లీపురం, కొక్కుపాడు, పల్లంపర్తి, గ్రామాలకు తాగునీటి సమస్య తలెత్తింది. తీరప్రాంత గ్రామాలైన ఎల్లూరు, వెలుగాజులపల్లి, బురదగాలి, కొత్తపాళెం, కుమ్మరపాళెం గ్రామాలకు తాగునీరు వెళ్లే అవకాశాలు లేకపోవడంతో ప్రజలు తాగునీటికి కటకటలాడారు. వాకాడులో విద్యుత్ శాఖ అధికారులు సకాలంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయకపోవడం వలనే వారం రోజులుగా తాగునీటి సమస్య తీవ్రమైందని తెలిసింది. వారం రోజులుగా తాగునీటి ఎద్దడి ఏర్పడినప్పటికీ సంబంధిత ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పట్టించుకోలేదని ఈ ప్రాంతాల ప్రజలు వాపోయారు.

మట్టి తరలింపును అడ్డుకున్న గ్రామస్తులు



వాహనాలను అడ్డుకుంటున్న చంద్రశేఖరపురం గ్రామస్తులు

కోట, ఆగస్టు 29: మండల పరిధిలోని గూడలి పంచాయతీలో గల చంద్రశేఖరపురం చెరువులోని మట్టిని తరలిస్తున్న టిప్పర్లను గురువారం గ్రామస్తులు అడ్డుకున్నారు. కోట మండలం మీదుగా జరుగుతున్న రోడ్డు పనులకు ఓ ప్రైవేట్ కాంట్రాక్టర్ ఇక్కడ చెరువులోని మట్టిని టిప్పర్ల ద్వారా తరలిస్తున్నాడు. ఎలాంటి అనుమతులు లేకుండా జేసీబీలను చెరువులో ఉంచి టిప్పర్లకు మట్టి తరలిస్తుండగా మండల టీడీపీ మైనార్టీసెల్ అధ్యక్షుడు మస్తాన్ బాషా ఆధ్వర్యంలో చంద్రశేఖరపురం గ్రామస్తులు వాహనాల వద్దకు చేరుకొని అడ్డుకున్నారు. తక్షణం మట్టి తరలింపు ఆపకపోతే గ్రామస్తులమంతా బైఠాయిస్తామని, ప్రభుత్వ కార్యాలయాలు ముట్టడి చేస్తామని హెచ్చరించారు. దీంతో టిప్పర్ల యజమానులు స్థానికులను సర్దుబాటు ప్రయత్నాలు చేసినప్పటికి ఆగలేదు. గ్రామస్తులంతా చెరువులో బైఠాయించడంతో రెండు గంటల తరువాత చేసేదిలేక టిప్పర్లు, జేసీబీలు వెనక్కు వెళ్లాయి.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



మహిళలకు సర్టిఫికెట్లు అందజేసిన సునీత సేవాసంస్థ సభ్యులు

గూడూరు అర్బన్, ఆగస్టు 29: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు ఉచిత వృత్తివిద్యా కోర్సులను తమ సేవాసంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని సునీత సేవాసంస్థ ప్రధాన కార్యదర్శి సారంగం సులక్ష్మీ అన్నారు. స్థానిక సునీత సేవాసంస్థ కార్యాలయంలో మహిళలకు మూడు నెలల పాటు నిర్వహించిన కుట్టు శిక్షణా తరగతులు ముగియడంతో గురువారం సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో జ్యోతి, పద్మావతి, లక్ష్మీనారాయణ, ఎంవీరమణయ్య, సారంగం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఏడవ అదనపు జిల్లా జడ్జి షమ్మీపర్వీన్ సుల్తానాబేగం

గూడూరు, ఆగస్టు 29: స్థానిక కోర్టు ఆవరణలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సెప్టెంబరు 14వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా అన్ని శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని ఏడవ అదనపు జిల్లా జడ్జి షమ్మీపర్వీన్ సుల్తానాబేగం అన్నారు. గురువారం స్థానిక కోర్టుఆవరణలో వివిధశాఖల అధికారులతో సమావేశంనిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రాజీ అయ్యే కేసులకు సంబంధించిన కక్షిదారులు లోక్‌అదాలత్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. న్యాయమూర్తి సులోచనారాణి, డీఎస్పీ రమణకుమార్, సీఐలు శేఖర్‌బాబు, కిషోర్‌బాబు, శ్రీనివాస్, అధికారులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో మొక్కలు నాటిన జనసేన



వెంకటగిరిటౌన్, ఆగస్టు 29: డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సెప్టెంబరు 2న పుట్టినరోజు సందర్భంగా స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో జనసేన ఉమ్మడి నెల్లూరు జిల్లా ప్రధాన కార్యదర్శి గూడూరు వెంకటేశ్వర్లు గురువారం మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయాలన్న దృక్పథంతో రాజకీయాల్లోకి వచ్చారన్నారు.

నెల్‌కాస్ట్ కార్మికులకు ఉచిత వైద్య సేవలు

ఓజిలి, ఆగస్టు 29: గూడూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఓజిలి మండలం పెద్దపరియ వద్ద నెలకొల్పిన నెల్‌కాస్ట్ పరిశ్రమలో కార్మికులకు గురువారం ఉచిత వైద్యసేవలు అందించారు. నెల్లూరు కిమ్స్ ఆసుపత్రికి చెందిన వైద్యులు ఇక్కడి 350 మంది కార్మికులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో కిమ్స్ వైద్యులు రవికిరణ్, హేమంత్, శ్రీనివాసులు నాయుడు, సత్యశీలతోపాటు గూడూరు రోటరీ క్లబ్ సీనియర్ సభ్యులు ఎల్లసిరి గోపాలరెడ్డి, రోటరీ క్లబ్ వెస్ట్ అధ్యక్షుడు నాసినం నాగులు, కార్యదర్శి గిరి, నెల్‌కాస్ట్ యాజమాన్యం పాల్గొన్నారు.

ముత్యాలమ్మ హుండీ లెక్కింపు కార్యక్రమం

చిల్లకూరు, ఆగస్టు 29: మండలంలోని తూర్పుకనుపూరు గ్రామంలో వెలసివున్న ముత్యాలమ్మ అమ్మవారి హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని గురువారం దేవదాయశాఖ అధికారులు శ్రీనివాస్‌బాబు, నవీన్‌కుమార్, ఛైర్మన్ ఇంద్రసేనమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. 81 రోజులకు గాను భక్తులు నగదు రూపంలో చెల్లించిన కానుకలు ముత్యాలమ్మ ఆలయ హుండీలో రూ.18,78,349, పోలేరమ్మ ఆలయంలో రూ.2,92,164 మొత్తం రూ.21,70,513 ఆదాయం వచ్చినట్లు దేవదాయశాఖ అధికారులు తెలిపారు. సురేంద్రరెడ్డి, కమిటీ సభ్యులు చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులు, బాబు, బాలాజీ పాల్గొన్నారు.

పాస్టర్ల ఫెలోషిఫ్ నూతన కార్యవర్గం ఏర్పాటు

నాయుడుపేట, ఆగస్టు 29: నాయుడుపేట పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గాన్ని స్థానిక లూథరన్ చర్చిలో సంఘ నాయకులతో ఏకగ్రీవంగా గురువారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ఎస్‌ఎం వినయ్‌కుమార్, సలహాదారులుగా యేసుపాదం, జోసెఫ్‌రాజు, సూరిబాబు, లూథర్, అధ్యక్షుడిగా రెవ. ఓ మైకెల్‌బెన్‌హర్, ఉపాధ్యక్షుడిగా శరత్‌బాబు, కార్యదర్శిగా ప్రేమ్‌కుమార్, సహకార్యదర్శిగా సురేష్‌పాల్, కోశాధికారిగా మురళీధర్, ఈసీ మెంబర్లుగా శ్యాముల్, హైజాక్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

తహసీల్దార్‌కు సత్కారం

పెళ్లకూరు, ఆగస్టు 29: పెళ్లకూరు మండల తహసీల్దార్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన దారకానాథరెడ్డిని గురువారం టీడీపీ నేతలు కలిశారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డి, సీనియర్ నాయకులు పేరం రమేష్ నాయుడు, ఉమ్మడి నెల్లూరు జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు కందమూడి శివకుమార్, నాయకులు కాటూరు గోపాల్‌రెడ్డిలు పుష్పగుచ్ఛం అందించి శాలువాలతో సత్కరించారు.

పుష్కరిణి అభివృద్ధికి సహకారమందిస్తా

- టీటీడీ మాజీ చైర్మన్ చదలవాడ



చదలవాడను సత్కరిస్తున్న ఆలయ అధికారులు, పక్కనే సన్నారెడ్డి రవీంద్ర రెడ్డి

సూళ్లూరుపేట, ఆగస్టు 29: సూళ్లూరుపేట మున్సిపాలిటీ మన్నారుపోలూరులోని సత్య జాంబవతి సమేత అలఘు మల్లారి కృష్ణస్వామి ఆలయానికి సంబంధించిన పుష్కరిణిని అభివృద్ధి చేసేందుకు తనవంతు సహకరిస్తానని టీటీడీ మాజీ చైర్మన్ చదలవాడ కృష్ణమూర్తి అన్నారు. గురువారం ఆయన మన్నారుపోలూరు ఆలయాన్ని సందర్శించారు. గతంలో ఆయన హయాంలో ఈ ఆలయాన్ని టీటీడీలో విలీనం చేశారు. ఆలయ అభివృద్ధికి టీటీడీ రూ.5 కోట్లు మంజూరు చేయడంతో రెండేళ్లుగా జీర్ణోద్ధరణ పనులు జరిగాయి. ఈ నెల 25 నుంచి 28వ తేదీ వరకు కుంభాభిషేక వేడుకలు టీటీడీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ క్రమంలో గురువారం చదలవాడ ఆలయానికి విచ్చేసి స్వామివారిని దర్శించుకొన్నారు. ఆయనతో పాటు శ్రీసిటీ ఎండీ సన్నారెడ్డి రవీంద్ర రెడ్డి ఉన్నారు. ముందుగా వారికి అధికారులు, గ్రామస్తులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి పూజలనంతరం సన్మానించారు. గ్రామస్తులు మునస్వామి, బాబురెడ్డి పాల్గొన్నారు.

దక్కిలి ఎస్ఐగా శివశంకర్



దక్కిలి, ఆగస్టు 29: మండలంలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం గట్టి చర్యలు తీసుకుంటామని దక్కిలి ఎస్ఐ శివశంకర్ అన్నారు. గురువారం ఆయన దక్కిలి ఎస్ఐగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు.

ఓజిలి ఎస్ఐగా స్వప్న



ఓజిలి, ఆగస్టు 29: ఓజిలి ఎస్ఐగా స్వప్న గురువారం బాధ్యతలు చేట్టారు. ఎస్పీ సుబ్బరాయుడు ఇక్కడ ఎస్ఐగా పనిచేసిన రవిబాబును తిరుపతి వీఆర్‌కు బదిలీ చేయగా, వీఆర్‌లో ఉన్న స్వప్నను ఓజిలి ఎస్ఐగా నియమించారు.

దొరవారిసత్రం ఎస్ఐగా అజయ్‌కుమార్



దొరవారిసత్రం, ఆగస్టు 29: దొరవారిసత్రం ఎస్ఐగా జి.అజయ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. గురువారం ఎస్పీ సుబ్బరాయుడు దొరవారిసత్రంలో పనిచేస్తున్న ఎస్ఐ తిరుమలరావును వీఆర్‌కు బదిలీ చేశారు. ఆయన స్థానంలో వీఆర్‌లో ఉన్న అజయ్‌కుమార్ బదిలీపై ఇక్కడ బాధ్యతలు చేపట్టారు.

ఉపాధ్యాయులకు బహుమతుల ప్రదానం



బహుమతులను అందజేస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

గూడూరు, ఆగస్టు 29: ఉపాధ్యాయులకు క్రికెట్ పోటీలు నిర్వహించేందుకు ప్రగతి సేవాసంస్థ ముందుకు రావడం అభినందనీయమని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన క్రికెట్ పోటీలలో గెలుపొందిన జట్టుకు గురువారం స్థానిక ఏఏరెడ్డి ప్రభుత్వ స్టేడియంలో బహుమతులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పని ఒత్తిడిలో ఉండే ఉపాధ్యాయులకు ఆటవిడుపుగా క్రికెట్ పోటీలను నిర్వహించడం ఆనందదాయకమన్నారు. విజేతగా నిలిచిన బాలాయపల్లి మండలం జట్టుకు, రన్నర్స్‌గా నిలిచిన వాకాడు మండలం జట్టుకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కడివేటి చంద్రశేఖర్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లురాజు, ధనుంజయరెడ్డి, కరిముల్లా, శ్రీనివాసులు, సురేష్‌రెడ్డి, టీఆర్‌మణి, విజయ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో పరిశీలన

నాయుడుపేట, ఆగస్టు 29: నాయుడుపేట ఎల్‌ఏసాగరంలోని బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలను గురువారం డీఎంహెచ్‌వో, టాస్క్‌ఫోర్స్ అధికారులు పరిశీలించారు. బుధవారం గురుకులంలో కలుషిత ఆహారంతో విద్యార్థులు డయేరియా బారిన పడిన విషయం విధితమే. దాంతో డీఎంహెచ్‌వో, టాస్క్‌ఫోర్స్ అధికారులు గురుకులంలోని తాగునీరు, ఆహారపదార్థాల నాణ్యతను పరిశీలించారు. వీటిపై నివేదికను కలెక్టర్, డీఎంహెచ్‌వోకి ఇవ్వనున్నట్లు తెలిపారు. అలాగే స్థానిక తుమ్మూరు, ఎల్‌ఏసాగరంలోని అర్బన్ పబ్లిక్ హెల్త్ సెంటర్లను పరిశీలించి అక్కడి ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎం, వైద్య సిబ్బందితో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. తిరుపతి జిల్లా ప్రోగ్రామింగ్ మానిటరింగ్ ఆఫీసర్ పి.శ్రీనివాసరావు, జిల్లా గణాంకాధికారి సి.నాగేంద్రకుమార్, జిల్లా పబ్లిక్ నర్సింగ్ ఆఫీసర్ ఎ.బేబీరాణి, జిల్లా ప్రోగ్రామింగ్ ఆఫీసర్ పి.ప్రకాష్, డాక్టర్ షఫీఉల్లా తదితరులు ఉన్నారు.

గురుకులాల్లో తహసీల్దారు తనిఖీలు

కోట, ఆగస్టు 29: కోటలోని పలు ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లు, గురుకులాలను గురువారం తహసీల్దారు కటారి జయజయరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా గురుకులాలను తహసీల్దారు పరిశీలించి ప్రిన్సిపాల్, వార్డెన్‌లకు పలు హెచ్చరికలు చేశారు. ముందుగా కోటలోని బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకులం, యానాదుల బాలికల గురుకులం, బీసీ బాలుర గురుకులాలతో పాటు కోటలోని షెడ్యూల్ కులాల బాలికల వసతిగృహాలను పరిశీలించారు. విద్యార్థులు తింటున్న భోజనం, కూరలను, తాగునీరు పరిశీలించారు. గురుకులం నుంచి విద్యార్థులను బయటకుపంపితే కఠినమైన చర్యలు తీసుకుంటామని ఒక ప్రిన్సిపాల్‌ను హెచ్చరించారు.

అంతర్జాతీయ క్రీడలకు కోట యువకుడి ఎంపిక

కోట, ఆగస్టు 29: కోట పట్టణానికి చెందిన షాజిద్‌బాషా అంతర్జాతీయ క్రీడలకు ఎంపిక కావడంతో గురువారం స్థానికులు అతడిని అభినందించారు. ట్రాన్స్‌కోలో పనిచేస్తున్న షాజిద్‌బాషా అండర్ 40 విభాగంలో ఇటీవల వెస్ట్‌బెంగాల్‌లో జరిగిన దేశస్థాయి అథ్లెటిక్ అండ్ పవర్ లిఫ్టింగ్‌లో ప్రతిభా పాటవాలు కనపరచి ఈ నెల 30నుంచి సెప్టెంబరు 4వ తేదీ వరకు నేపాల్‌లోని పోఖోరా లో జరిగే అంతర్జాతీయ అథ్లెటిక్ అండ్ పవర్ లిఫ్టింగ్ క్రీడలకు ఎంపికయ్యాడు.